www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్
20.07.2024
సంపుటి:2 సంచిక:276

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



# గ్రూప్ 2 వాయిదా

- నిరుద్యోగుల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం
- షెడ్యూల్ ప్రకారం ఆగస్ట్ 7, 8న పరీక్ష
- నిరుద్యోగుల ఆందోళనలు ఉధృతం కావడంతో నిర్ణయం


**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో నిరుద్యోగుల ఆందోళనతో గ్రూప్ 2 పరీక్ష వాయిదా పడింది. డిసెంబరుకు పరీక్ష వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం మధ్యాహ్నం అధికారికంగా ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఆగస్ట్ 7, 8 తేదీల్లో పరీక్ష జరగాల్సి ఉంది. అయితే, డీఎస్సీ పరీక్షల క్రమంలో గ్రూప్ 2 వాయిదా వేయాలని నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. తమకు ప్రిపరేషన్‌కు సమయం లేదని వాదించారు. అయితే,

..మిగతా 2 లో

### కొనసాగుతోన్న డీఎస్సీ..

మరోవైపు, రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తెలంగాణవ్యాప్తంగా 11,062 పోస్టులకు 2.79 లక్షల దరఖాస్తులు అందాయి. ఆన్ లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తుండగా.. ఆగస్ట్ 5వ తేదీతో ముగియనున్నాయి.



## దేశంలోకి ఒక్క గ్రాము డ్రగ్స్ రానివ్వం

- డ్రగ్స్ సరఫరా నియంత్రణ కోసం కృషి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

..మిగతా 3 లో



## ఇంజినీరింగ్ ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు

- 75200 మందికి అలాట్ మెంట్
- 3494 వేకెంట్

..మిగతా 2 లో




# విండోస్ 'క్లోజ్'

- మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్ లో సాంకేతిక సమస్య
- ఎయిర్ పోర్టుల్లో పనిచేయని డిస్ ప్లే బోర్డులు
- బోర్డింగ్ పాస్ లు చేతితో రాసిచ్చిన ఎయిర్ పోర్ట్ సిబ్బంది
- సోషల్ మీడియాలో మీమ్స్ వైరల్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఏర్పడిన సమస్య వల్ల శంషాబాద్ ఎయిర్ పోర్టులోనూ గందరగోళం ఏర్పడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పలు విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. ఇప్పటివరకు 35 విమానాలు రద్దు చేసినట్లుగా ఎయిర్‌పోర్టు అధికారులు ప్రకటించారు. ఎయిర్‌పోర్టులో డిస్‌ప్లే బోర్డులు కూడా పని చేయడం లేదు. మాన్యువల్ బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు .. అతి కష్టం మీద మాన్యువల్ గా కొన్ని పనులు చక్క బెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్ని విమాన సర్వీసులు రద్దు చేయకుండా ఉండటానికి

..మిగతా 2 లో



# సర్కారు బడులు బాగుచేద్దాం



- ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి
- మూడో తరగతి వరకు ప్లే స్కూల్స్ తరహాలోనే బోధించాలి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు ప్రభుత్వం సరికొత్త విధానంతో ముందుకెళ్లనుంది. రాబోయే మూడేళ్లలో ప్రభుత్వ స్కూళ్లను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సహా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌తో సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సొంత గ్రామాల్లోనే

..మిగతా 2 లో



## ఆగస్ట్ 3న రేవంత్ అమెరికా పర్యటన

- పెట్టుబడులను ఆకర్షించేందుకు టూర్..
- అధికారులు, మంత్రులతో కలిసి అగ్రరాజ్యానికి
- ఆగస్ట్ 11న స్వదేశానికి రాక
- గ్లోబల్ ఇన్వెస్టర్లతో కీలక సమావేశం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల్ని ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లనున్నారు. అధికారులు, మంత్రుల బృందంతో ఆయన ఆగస్టు మూడో తేదీన అమెరికాకు బయలుదేరుతారు. అమెరికాలోని పలు నగరాల్లో పర్యటించి మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం అవుతారు. పలు కంపెనీల సీఈఓ లు, పారిశ్రామికవేత్తలను కలసి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అవకాశాలపై ప్రజెంటేషన్

..మిగతా 2 లో

# చారాన కోడికి బారాన మసాలా



- లబ్ధి పొందిన కుటుంబాల కంటే కంటతడిపెట్టిన కుటుంబాలే ఎక్కువ
- రైతుకు శాపంగా మార్గదర్శకాలు ..
- రైతు భరోసా డబ్బులు డైవర్షన్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిన్న లక్ష రూపాయాల వరకు రుణమాఫీ చేసినట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. లక్ష రూపాయాల వరకు రుణాలు మాఫీ చేసినట్లు ప్రకటించినప్పటికీ.. ఆ లోపు రుణాలు ఉన్న చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటల రుణమాఫీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ సర్కార్ పంటల రుణమాఫీ చూస్తుంటే చారాణ కోడికి.. బారాణ మసాలా.. అనే సామెత గుర్తుకు వస్తుందని కేటీఆర్ విమర్శించారు.
రుణమాఫీ అయిన రైతుల కన్నా.. కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు.. రైతుమాఫీ పథకానికి మరణ శాసనాలు అయ్యాయని తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు రుణమాఫీ కాక అంతులేని ఆందోళనలో ఉన్న సమయంలో ఈ సంబురాలు ఎందుకు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. మభ్యపెట్టే మీ పాలన గురించి.. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఇంతకాలం.. అటెన్షన్ డైవర్షన్..! ఇప్పుడేమో.. ఫండ్స్ డైవర్షన్..!! అంటూ కేటీఆర్ సెటైర్లు వేశారు.



### బీసీ జనగణన తర్వాతే
## పంచాయితీ ఎన్నికలు

- బీఆర్ఎస్ చచ్చిన పాము
- గులాబీ పార్టీ పేకమేడలా కూలిపోతుంది
- ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన
- బీఆర్ఎస్ పథకాలతో ఏ ప్రయోజనమూ చేకురలేదు
- కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీసీ జనగణన అనంతరం తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాలుగు గోడల మధ్య తాము ఏ నిర్ణయాలు తీసుకోవడం లేదని, తమది ప్రజా ప్రభుత్వమని తెలంగాణ రెవెన్యూ, ఐ అండ్ పీఆర్, గృహ నిర్మాణం శాఖల మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రజల మధ్యలో వారి అభిప్రాయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలిస్తుందని క్లారిటీ

..మిగతా 2 లో

## బీఆర్ఎస్ హయాంలో రైతుకు అందిన సాయం
# రూ. 1,20,005 కోట్లు..



- కేసీఆర్ రైతును రాజును చేశాడు
- 24 గంటల కరెంట్ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే..
- రైతు బంధు, రుణమాఫీ చేశాం
- మాజీ మంత్రి హరీశ్ రావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. రైతును రాజు చేశారు. దండగన్న వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత కేసీఆర్‌దే. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రెండు దఫాలుగా పంటల రుణమాఫీ చేశారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతుకు, అతని కుటుంబానికి ఆర్థిక భరోసా నింపారు. కొత్త ప్రాజెక్టులతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులకు కరెంట్ కష్టాల నుంచి

..మిగతా 2 లో

# నేడు మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్




- క్రిటికల్ మినరల్ ఈ-ఆక్షన్ బిడ్డర్ల లిస్ట్ వెల్లడించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ పోర్టల్ ప్రారంభించనున్న మినిస్టర్
- మైనింగ్ రంగంలో మరింత అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**

ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకునేందుకు సృజనాత్మక విధానంలో ముందుకెళ్లడం, అంతర్జాతీయంగా అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అలవర్చుకోవడం తదితర అంశాల

..మిగతా 3 లో



## యువతి తలలో 70 సూదులు

- చికిత్స పేరుతో తలలోకి చొప్పించిన తాంత్రికుడు
- 2 గంటల పాటు సర్జరీ చేసి తొలగించిన డాక్టర్లు
- ఒడిశాలోని బలంగీర్ జిల్లాలో ఘటన

..మిగతా 3 లో



### పూజా ఖేడ్కర్‌కు
## గట్టి షాక్

- మోసానికి పాల్పడటంపై కేసు నమోదు
- యూపీఎస్సీ అభ్యర్థిత్వం రద్దు
- మహారాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం

..మిగతా 2 లో



# సర్కారు బడులు బాగుచేద్దాం

మొదటిపేజీ తరువాయి

విద్యార్థులు చదువుకునేలా వీలు కల్పించాలని చెప్పారు.అంగన్వాడీల్లో ప్లే స్కూళ్ల తరహాలోనే మూడో తరగతి వరకూ విద్యా బోధనకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అంగన్వాడీలో విద్యా బోధన కోసం మరో టీచర్‌ను నియమించాలని కోరారు. నాలుగో తరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పిల్లలు చదువుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ స్కూళ్లకు ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్స్‌తో విద్యార్థులకు అన్ని వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యావేత్తల అభిప్రాయం తీసుకున్నాక ఒకట్రెండు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్దేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**ప్రతి నియోజకవర్గంలోనూ..**

ప్రతి నియోజకవర్గంలోనూ 20 నుంచి 25 ఎకరాల ప్రాంగణంలో ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్స్‌ను మినీ ఎడ్యుకేషన్ హబ్స్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో అధునాతన వసతులతో నాణ్యమైన విద్య అందిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలను 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్' పేరుతో ఒకే చోట ఏర్పాటు చేయనున్నారు. తొలుత పైలట్ ప్రాజెక్టులుగా కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో ఈ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి వివరాలను సైతం సీఎం అడిగి తెలుసుకున్నారు.

# విండోస్ 'క్లోజ్'

మొదటిపేజీ తరువాయి




ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బోర్డింగ్ పాసులను చేతితో రాసి ఇస్తున్నట్లు ఎయిర్ పోర్ట్ ప్రకటించింది. తప్పని సరి పరిస్థితుల్లోనే కొన్ని విమానాలను రద్దు చేస్తున్నారు. మాన్యువల్ గా ఆపరేట్ చేసి.. రన్ చేయగలిగిన విమానాలను నడుపుతున్నారు ఆన్ లైన్ సేవలకు అంతరాయం ఏర్పడినందున ప్రయాణికులు వీలైనంత త్వరగా ఏయిర్ పోర్ట్ కు చేరుకుని చెక్ ఇన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అయితే బయులేరే ముందు విమానం రద్దయిందో లేదో చూసుకోవాలని .. ఎయిర్ లైన్స్ సంస్థలను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇండిగో, ఆకాసా ఎయిర్, స్పైస్‌జెట్ వంటి పలు విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు కొన్ని సూచనలు చేశాయి. మైక్రోసాఫ్ట్ లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా నెట్ వర్క్ అంతటా తమ సేవలు ప్రభావితమయ్యాయని గా ఆన్ లైన్ బుకింగ్, చెక్ ఇన్ సేవలు ఆగిపోయాయని తెలిపింది. టెక్నాలజీకి ప్రత్యామ్నాయం లేకపోతే ఎలా ఉంటుందో చూస్తున్నామంటూకొంత మంది ప్రయాణికులు సెటైరికల్ గా సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే ఎక్స్ చీఫ్ ఎలన్ మస్క్ కూడా మైక్రోసాఫ్ట్ పై సెటైర్ వేశారు. కార్పొరేట్ కంపెనీల్లో పని చేయాల్సిన అవసరం లేదని ఉద్యోగులు ఆనంద పడుతున్నట్లుగా ఎక్కువ మంది పోస్టులు పెట్టారు.

# ఆగస్ట్ 3న రేవంత్ అమెరికా పర్యటన

మొదటిపేజీ తరువాయి




ఇచ్చిన తర్వాత ఆగస్టు 11న హైదరాబాద్ కు వచ్చే అవకాశం ఉంది.

**జనవరిలో దావోస్ లో రేవంత్ పర్యటన**

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండో సారి విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. గతంలో దావోస్‌లో జరిగిన పెట్టుబడుల సదస్సుకు జనవరిలో హాజర్యయారు. పలు అంతర్జాతీయ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇటీవల మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు అమెరికాలో పర్యటించారు. పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఇప్పుడు నేరుగా ముఖ్యమంత్రి రంగంలోకి దిగుతున్నారు. వారం రోజుల పాటు పర్యటనలో ఆయన తెలంగాణ ప్రవాసులను కూడా కలిసే అవకాశాలు ఉన్నాయి. అనేక పెట్టుబడుల ప్రతిపాదనలు ఉన్నాయని వాటిని ఫాలో అప్ చేసుకోవాల్సి ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

**అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులే టార్గెట్**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కేటీఆర్ .. పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలకు వెళ్లేవారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా అరుదుగానే విదేశీ టూర్లకు వెళ్లారు. కానీ కేటీఆర్ మాత్రం మొత్తం బాధ్యత తనపై వేసుకుని దావోస్, అమెరికా, యూరప్ సహా పలు దేశాల్లో పర్యటించి అంతర్జాతీయ కంపెనీలతో పెట్టుబడుల ఒప్పందాలు చేసుకునేవారు. ఇప్పుడు నేరుగ ముఖ్యమంత్రే విదేశీ పర్యటనకు వెళ్తాండటంతో.. గ్లోబల్ ఇన్వెస్టర్ల నుంచి మరింత స్పందన వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో కీలక కంపెనీల భాగస్వామ్యం ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో పెద్ద ఎత్తున విదేశీ కంపెనీల భాగస్వామ్యం ఉండాలని రేవంత్ కోరుకంటున్నారు. ముఖ్యంగా మూసీ అధునీకీకరణ లాంటి ప్రాజెక్టుల విషయంలో విదేశీ సంస్థల సాయం ఉండాలని భావిస్తున్నారు. అలాగే ఫార్మా, టెక్ రంగాల్లో హైదరాబాద్ కు ఉన్న ఇమేజ్ దృష్ట్యా మరిన్ని కంపెనీలను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# బీఆర్ఎస్ హయాంలో రైతుకు అందిన సాయం రూ. 1,20,005 కోట్లు..

మొదటిపేజీ తరువాయి




విముక్తి చేశారు. వీటన్నింటితో పాటు మరిన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి.. రైతులను రాజులుగా తయారు చేశారు కేసీఆర్.

కానీ అదే కాంగ్రెస్ గవర్నమెంట్ లో రైతులు అరిగోస పడుతున్నారు. లక్ష రూపాయాల వరకు రుణమాఫీ అని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. చివరకు లక్ష వరకు రుణాలున్న చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రేవంత్ సర్కార్‌పై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. రేషన్ కార్డు లేదని చాలా మందికి రుణాలు మాఫీ చేయలేదని సమాచారం.

ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ హయాంలో సాగుకు స్వర్ణయుగం.. లక్ష కోట్లకు పైగా సంక్షేమం జరిగిందని తెలిపారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతన్నకు నేరుగా లక్షల కోట్ల రూపాయాల ఆర్థిక సాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు. రైతుభంధు పథకం కింద 69 లక్షల మంది రైతులకు రూ. 72,972 కోట్లు అందించారు. 11 వేల మంది రైతు కుటుంబాలకు రైతుబీమా కింద రూ. 6,488 కోట్లు అందజేశారు. రెండు దఫాల్లో రూ. 29,144.61 కోట్ల రుణమాఫీ చేశారు. ఇతర రైతు సంక్షేమ పథకాల కింద రూ.11.401 కోట్లు ఖర్చు పెట్టారు. కేవలం ఈ పథకాల ద్వారానే రైతులకు అందిన ఆర్థిక సాయం రూ. 1,20,005 కోట్లు.. దేశ చరిత్రలో ఇది ఆల్ టైం రికార్డ్ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బీసీ జనగణన తర్వాతే పంచాయితీ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి



ఇచ్చారు. గత ప్రభుత్వం (బీఆర్ఎస్ ప్రభుత్వం) కేంద్రంతో భేషజాలకు పోవడంతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లిందన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇస్తున్నట్లే, తెలంగాణకు సైతం న్యాయంగా రావాల్సిన నిధులను సక్రమంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని తాము కోరుతున్నామని పొంగులేటి తెలిపారు.

**గులాబీ పార్టీ పేకమేడలా కూలిపోతుంది, కారణం ఇదే**

బీఆర్ఎస్ పార్టీ నామ మాత్రంగా కూడా మిగిలే ప్రసక్తేలేదని, గులాబీ పార్టీ పేకమేడలా కూలిపోతుందని.. వారే కూల్చుకుంటున్నారని మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు అధికారం ఇచ్చే పరిపాలన మీద ఫోకస్ చేయాలని కానీ, ప్రతిపక్ష నేతలు, లాయర్లు, జడ్జీలు, సినీ సెలబ్రిటీలు, రియల్ ఎస్టేట్ సంబంధించిన వారి వ్యక్తిగత విషయాలు తెలుసుకునేందకు ఫోన్ ట్యాపింగ్ లాంటి అంశాలపై ఫోకస్ చేశారంటూ మండిపడ్డారు. వేలకోట్లతో నిర్మించినా కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని, త్వరలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ అన్ని కుట్రల్ని ప్రజలకు అర్థమయ్యేలా చేస్తామన్నారు.

చచ్చిన పాము బీఆర్ఎస్‌ను ఇంకా చంపాలని లేదు బీఆర్ఎస్ పార్టీ చచ్చిన పాము అని, ఇంకా చంపాలని తాము అనుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాలను దిగమింగుకోలేక చెప్పాల్సి వస్తుందన్నారు. ధరణి పేరుతో రైతులు, పేదల భూములు ఇష్టారాజ్యంగా దోచుకున్నారు. ధరణి చట్టాన్ని సవరించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. బీఆర్ఎస్ మంచి చేస్తే మంచి అని చెబుతాం, కానీ వారి చెడును కూడా ప్రజలకు చూపించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వేల కోట్ల ప్రజల సొమ్ముని కేసీఆర్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. నాలుగు గోడల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదని, తమది ప్రజా ప్రభుత్వం కనుక, వారి అభిప్రాయాలకు అనుగుణంగా పాలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో బీసీ జనగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.తెలంగాణ ధనిక రాష్ట్రం అని బయటకి గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష కోట్లు అప్పులు ఎందుకు చేసిందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సాయం అడిగితే నామోషీ అని మిషన్ భగీరథ లాంటి వాటికి గత ప్రభుత్వం (కేసీఆర్) నిధులు అడగలేదని చెప్పారు. తామెంతో చేశామని కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లు గొప్పలు చెప్పిన మిషన్ భగీరథ పథకం నీళ్లు రాష్ట్రంలో ఇంకా 30 శాతం మందికి చేరలేదని పేర్కొన్నారు.



# ఇంజినీరింగ్ ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు

- 75200 మందికి అలాట్ మెంట్
- 3494 వేకెంట్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :** రాష్ట్రంలో ఇంజినీరింగ్ ఫస్ట్ ఫేజ్ సీట్లను కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. మొత్తం 75200 మందికి సీట్ల అలాట్ మెంట్ జరిగింది. కాగా 3494 సీట్లు వేకెంట్ గా ఉన్నాయి. ఫస్ట్ ఫేజ్ లో భాగంగా ఈనెల 6 నుంచి 15 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టారు. 8 నుంచి 17వ తేదీ వరకు ఆప్షన్లను ఎంచుకున్నారు. కాగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు 96,238 మంది హాజరయ్యారు. అందులో 95,735 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి మొత్తం 175 ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. వాటిలో 78,694 సీట్లు ఉండగా 75200 మంది విద్యార్థులకు ఫస్ట్ ఫేజ్ లో సీట్ అలాట్ అయింది. కాగా 7 యూనివర్సిటీలు, 82 ప్రైవేట్ కాలేజీలు కలిపి మొత్తం 89 కాలేజీల్లో వంద శాత అడ్మిషన్లు జరిగాయి. అభ్యర్థుల అలాట్‌మెంట్ ఆర్డర్లను వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచారు. ఇతర వివరాలకు https://tgeapcet.nic.in వెబ్ సైట్ ను సందర్శించాలని అధికారులు సూచించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 23 లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆపై సంబంధిత కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

# పీజీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ రిలీజ్

- ఈనెల 30 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్
- ఆగస్టు 12, 13 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు చాన్స్
- వచ్చేనెల 20న సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్
- ఆగస్టు 31 నుంచి తరగతులు ప్రారంభం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**

ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మ్, ఫార్మ్ డీ లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను కన్వీనర్ రమేశ్ బాబు శుక్రవారం ప్రకటించారు. ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ శనివారం రానుండగా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 30 నుంచి ప్రారంభం కానుంది. ఆగస్టు 9 వరకు ఇది కొనసాగనుంది. స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 1 నుంచి 3వ తేదీ వరకు కొనసాగనుంది. వచ్చేనెల 12, 13 తేదీల్లో ఫస్ట్ ఫేజ్ వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 17న ప్రొవిజినల్ లిస్ట్ ను వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయనున్నారు. కాగా సీట్లు పొందిన విద్యార్థులు వచ్చేనెల 18 నుంచి 21 వరకు సంబంధిత కాలేజీల్లో ట్యూషన్ ఫీజు చెల్లించిన రశీదు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ కు హాజరై సీటు కన్ఫామ్ చేసుకోవాల్సి ఉంటుంది.సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఆగస్టు 20 నుంచి ప్రారంభం కానుందని పీజీఈసెట్ కన్వీనర్ రమేశ్ బాబు తెలిపారు. వచ్చేనెల 20 నుంచి 23వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతుందని వెల్లడించారు. 25, 26 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 27న తప్పొప్పుల సవరణకు చాన్స్ ఇచ్చారు. ప్రొవిజినల్ లిస్టును 30వ తేదీన వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయనున్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు సీట్లు పొందిన విద్యార్థులు సంబంధిత కాలేజీల్లో ట్యూషన్ ఫీజు చెల్లించిన రశీదు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ కు హాజరై సీటు కన్ఫామ్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా ఆగస్టు 31వ తేదీ నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని కన్వీనర్ స్పష్టంచేశారు. కాగా ఇతర వివరాలకు http://pgecetadm.tsche.ac.in వెబ్ సైట్ ను సందర్శించాలని ఆయన సూచించారు.

# పూజా ఖేడ్కర్‌కు గట్టి షాక్

- మోసానికి పాల్పడటంపై కేసు నమోదు
- యూపీఎస్సీ అభ్యర్థిత్వం రద్దు
- మహారాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్‌కు గట్టి షాక్ తగిలింది. ఆమె వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసిన యూపీఎస్సీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. నకిలీ పత్రాలు సమర్పించి మోసానికి పాల్పడటంపై కేసు నమోదు చేసింది. అంతేకాకుండా ఆమె యూపీఎస్సీ అభ్యర్థిత్వం రద్దుతో పాటు భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసేందుకు రంగం సిద్ధం చేసేలా షోకాజ్ నోటీసులు ఇచ్చింది. అధికార దుర్వినియోగం, యూపీఎస్సీకి తప్పుడు అఫిడవిట్ సమర్పించారన్న ఆరోపణలతో పలు వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన పూజా ఖేడ్కర్ అనుచిత ప్రవర్తనపై సమగ్ర దర్యాప్తు చేపట్టినట్లు యూపీఎస్సీ శుక్రవారం మధ్యాహ్నం ఓ ప్రకటనలో తెలిపింది. యూపీఎస్సీ పరీక్ష నిబంధనల్ని అతిక్రమించేలా ఆమె నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించామని తెలిపింది. ఆమె తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటోగ్రాఫ్/సంతకం, ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, అడ్రస్‌కు సంబంధించిన పత్రాలన్నీ మార్చడం మోసపూరిత ప్రయత్నాలకు పాల్పడ్డారని యూపీఎస్సీ పేర్కొంది.

# గ్రూప్ 2 వాయిదా

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే పలుమార్లు వాయిదా పడ్డ పరీక్షను ఎలాగైనా నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. అయితే, నిరుద్యోగుల ఆందోళనల ఉద్ధృతం కావడంతో సర్కారు వాయిదాపై సానుకూలంగా స్పందించి ఉత్తర్వులు జారీ చేసింది.

కాగా, 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేయగా.. 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. డీఎస్సీ, గ్రూప్ 2 వెనువెంటనే ఉండడంతో పరీక్ష వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా ఆందోళనలు సైతం నిర్వహించారు. పరీక్ష వాయిదాతో పాటు పోస్టుల సంఖ్య కూడా పెంచాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఇప్పటికే పలు కారణాలతో వాయిదా పడ్డ పరీక్ష తాజాగా.. మరోసారి వాయిదా పడింది. డిసెంబరులో పరీక్ష నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు.

# పెండింగ్ లోనున్న ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలి



ప్రభుత్వాలు మారిన పేద విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్షిప్స్, ఫీజు రీఎంబర్స్మెంట్ సకాలంలో అందించడం లేదు. 8 ఏళ్లుగా పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదు.సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్షిప్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 8213.57 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఫీజు రియాబర్స్మెంట్ పై ఆశలు పెట్టుకుని ప్రైవేట్ కాలేజీలలో చేరుతున్న విద్యార్థులకు చుక్కె ధారవుతోంది. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు వారిని ముప్పు తిప్పల పెడుతున్నాయి. డిగ్రీ ఇంటర్ అయిపోయిన విద్యార్థులకు మొత్తం ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నాయి .ఈ క్రమంలో ఫీజులు కట్టలేక కొందరు అర్ధాంతరంగా చదువు మానేస్తుంటే మరికొందరు అప్పులు చేసి ఎలాగో అలా కట్టేస్తున్నారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అరకొరక నిధులు టీచర్ల సరిపోవడం లేదు. ఫీజ్ రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ కలసి ఎనిమిదేళ్లగా 8214.57 కోట్లు బకాయిలు ఉండటం వలన విద్యారంగం పట్ల ఈ ప్రభుత్వం మీరు ఎలా ఉందో అర్థం అవుతుంది. సంవత్సరాల వారిగా చూస్తే 2018.19 సంవత్సరానికి (270)కోట్లు, 2019.20, (300) కోట్లు, 2020.21, (1,872) కోట్లు, 2021 22(2,150) కోట్లు 2022.23, (1,811) కోట్లు, 2023.24, (1811)కోట్లు వరకు పెండింగ్ లో ఉన్నాయి. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలల్లో రూపాయలు 8000 కోట్ల వరకు ఉన్నాయి. 2023 2024 లో నూతన ప్రభుత్వం విద్యారంగానికి రూ21877 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అంటే అస్తవ్యస్త ఉన్న ప్రభుత్వ విద్యారంగానికి ఈ నిధులు సరిపోయే పరిస్థితి లేదు.అసలు కేటాయించిన నిధులలో ఎన్ని విడుదల చేస్తారన్నది ఒక సందేశమైతే వచ్చేయడాది ఫీజు రియంబర్స్మెంట్ సర్దుబాటు చేస్తారన్నది మరో సందేశం.ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను మూడు నెలలకు ఒకసారి వాయిదాల పద్ధతిలో చెల్లించేలా గత ప్రభుత్వం మార్గదర్శకాలను తీసుకొచ్చింది.దాని ప్రకారం విద్య సంవత్సరం ప్రారంభంలో 25% మధ్యలో 50 శాతం చివర్లో 25% ఇస్తామని పేర్కొంది.కానీ ఈ విధానాన్ని పాటించడం లేదు. ఫీజ్ రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపులలో భాగంగా ఆయా కళాశాలలకు ప్రభుత్వం ఏడాది క్రితం నిర్దేశిత మొత్తాలతో టోకెన్లను జారీ చేసింది కానీ ఇంతవరకు ఈ కొత్త ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయలేదు.ఫలితంగా రాష్ట్రంలో సుమారు 16 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.ఇదే సమయంలో తాము కళాశాలలను నిర్వహించలేకపోతున్నామని యాజమాన్యాలు గగ్గోలు పెడుతున్నాయి.కొన్ని కాలేజీలు విద్యార్థుల దగ్గర్నుంచి ఫీజులను వసూలు చేసుకుంటున్నారు. ఫీజు కట్టకపోతే సర్టిఫికెట్లను ఇచ్చేది లేదని చెబుతున్నాయి. దీంతో కొందరు విద్యార్థులు చదువులకి మధ్యలోనే స్వస్తి చెపుతున్నారు.ఫీజ్ రెగ్యులర్టీ కమిటీ ప్రతి మూడేళ్లకు ఒకసారి ప్రతి విద్యా కోర్సులతోపాటు ఇతర కోర్సులకు ఫీజు పెంచుతుంది కానీ ఈ సర్కారు మాత్రం ఆ మేరకు ఫీజు రియంబర్స్మెంట్ తోపాటు విద్యార్థులకు అందించే ఉపకార వేతనాలకు పెంచడం లేదు. జులై 24న జరిగే అసెంబ్లీ సమావేశాలలో అయినా కొఠారి కమిషన్ చెప్పినట్టు విద్యకి 30% బడ్జెట్ను కేటాయించాలి పెండింగ్ లో ఉన్న ఫీజ్ రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి.



ఆసిఫ్ జార్జ్
పిడిఎస్ యు నేత



# నేడు మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్

**మొదటిపేజీ తరువాయి**

ద్వారా మైనింగ్ రంగంలో మరింత అభివృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ లోని బేగంపేటలో మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్‌షో జరగనుంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇన్నొవేటివ్ మినరల్ హంట్ టెక్నిక్స్ ను తెలుసుకోవడం, అందుబాటులో ఉన్న జియో ఫిజికల్ డేటా ఆధారంగా మైనింగ్ పై మరింత అవగాహన పెంచుకోవడం, మైనింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికత వినియోగం అంశాల వినియోగం తదితర అంశాలపై ఈ హ్యాకథాన్, రోడ్ షోల్లో వివరించనున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా కేంద్రమంత్రి .. నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ పోర్టల్ ను ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ కు సంబంధించిన సంపూర్ణ సమాచారం ఈ వెబ్ సైట్లో అందుబాటులోకి రానుంది. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరి 29న క్రిటికల్ మినరల్స్ కు సంబంధించిన రెండో, మూడో విడత ఈఆక్షన్ జరిగింది. కాగా శనివారం నిర్వహించనున్న కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ రెండు విడుతల వేలంలో ప్రిఫర్డ్ బిడ్డర్స్ పేర్లను వెల్లడించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబేతోపాటు తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ ఉన్నతాధికారులు, మైనింగ్ రంగానికి సంబంధించిన ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు.

**బొగ్గు దిగుమతులు తగ్గించుకోవాలి : కిషన్ రెడ్డి**

బొగ్గు రంగంలో భారతదేశం ఆత్మనిర్భరత సాధించే దిశగా ముందుకెళ్తోందని, ఈ విషయంలో మరింత సానుకూల ఫలితాలు సాధించేందుకు బొగ్గు దిగుమతులపై ఆధారపడకూడదని, దీన్ని తగ్గించుకుని.. దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. కోల్‌కతాలో శుక్రవారం కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన కేంద్రమంత్రి.. అనంతరం ఉద్యోగులు, ఉన్నతాధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. భారతదేశం బొగ్గురంగంలో సాధిస్తున్న ప్రగతిలో సీఐఎల్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. సీఐఎల్ పోషిస్తున్న పాత్రను అభినందించిన కిషన్ రెడ్డి.. రానున్న రోజుల్లో ప్రధాని మోడీ సంకల్పించిన లక్ష్యాలను చేరుకునేందుకు మరింత కష్టపడి పనిచేయాలన్నారు. దేశీయ అవసరాలకు కొత్త బ్లాకులను గుర్తించడం బొగ్గు ఉత్పత్తిని చేపడుతూనే.. పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆయన సూచించారు. అనంతరం హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. దేశంలో కాపర్ ఎక్స్‌ప్లొరేషన్లో పనిచేస్తున్న ఏకైక సంస్థ అయిన హెచ్‌సీఎల్ రానున్న రోజుల్లో దేశీయ అవసరాలకు తగ్గట్లుగా మరింత ఉత్పత్తిని పెంచడంపై పనిచేయాలన్నారు. జీఎస్ఐ కార్యాలయంలో జరిగిన సమీక్షలో పాల్గొని సంస్థ సాధించిన ప్రగతిని, రానున్న రోజుల్లో కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. తదనంతరం.. జీఎస్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన.. నేషనల్ ల్యాండ్ స్లైడ్ ఫోర్‌కాస్టింగ్ సెంటర్ ను కేంద్రమంత్రి ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో.. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో కొండప్రాంతాల్లో మట్టిపెళ్లలు విరిగిపడటం వల్ల జరుగుతున్న ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు ముందుగానే వీటిని గుర్తించే విధంగా ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించగా.. సానుకూల ఫలితాలు వచ్చాయని, రానున్నరోజుల్లో ఆధునిక సాంకేతికను వినియోగించుకుంటూ ముందుకెళ్లాలని అధికారులకు కిషన్ రెడ్డి సూచించారు.

# దేశంలోకి ఒక్క గ్రాము డ్రగ్స్ రానివ్వం

**- డ్రగ్స్ సరఫరా నియంత్రణ కోసం కృషీ**
**- కేంద్ర హోం మంత్రి అమిత్ షా**



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:** డ్రగ్స్ సరఫరా నియంత్రణ కోసం త్వరలో కొత్త విధ్వంసక వ్యవస్థను తెచ్చేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఒక్క గ్రాము డ్రగ్‌ను కూడా దేశంలోకి రానివ్వమని, అలాగే మన దేశం ద్వారా ఇతర దేశాలకు సరఫరా కానివ్వమని స్పష్టం చేశారు. డ్రగ్స్ సరఫరా వ్యవస్థను ధ్వంసం చేసేందుకు చాలా కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గురువారం దిల్లీలో జరిగిన కేంద్ర, రాష్ట్ర యాంటీ నార్కోటిక్ సంస్థల 7వ అపెక్స్ సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు, మానస్ (MANAS) పేరుతో '1933' హెల్ప్‌లైన్ నంబరును, info.ncbmanas@gov.in ఈమెయిల్ ఐడీని ప్రారంభించారు. వీటితోపాటు ncbmanas.gov.in అనే వెబ్‌సైట్‌లోనూ డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని, మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ (ఎన్‌సీబీ)కి అందించవచ్చని అమిత్ షా పేర్కొన్నారు



# యువతి తలలో 70 సూదులు

**విశాలభారతి, వెబ్ డెస్క్:**

ఒడిశాలోని బలంగీర్ జిల్లాకు చెందిన ఓ యువతి తలలో ఉన్న 70 సూదులను వైద్యులు తొలగించారు. సీటీ స్కానింగ్ ద్వారా సూదులను గుర్తించిన డాక్టర్లు, రెండు గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్సను నిర్వహించి ఆమెను ప్రాణాలతో కాపాడారు. బాలిక తలలోకి సూదులు చొప్పించిన తాంత్రికుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బలంగీర్ జిల్లాలోని సింధేకెలా పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ యువతి కొన్నేళ్ల క్రితం విచిత్రంగా ప్రవర్తించింది. తన చేతిని పలుమార్లు కోసుకుంది. దీంతో ఆమెను కుటుంబసభ్యులు స్థానిక వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. అయితే వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు, ఆమె ఆరోగ్యంగానే ఉందని ధ్రువీకరించారు. ఆ తర్వాత కొద్ది రోజులకు మళ్లీ అలానే ప్రవర్తించింది. అప్పుడు యువతికి దెయ్యం పట్టిందని భావించి తాంత్రికుడి వద్ద తీసుకెళ్లాడు తండ్రి. ఆ సమయంలో చికిత్స పేరుతో యువతి తలలోకి ఓ సూది చొప్పించాడు తాంత్రికుడు. అలా కొన్ని నెలలుగా సూదులను చొప్పిస్తూనే ఉన్నాడు. ఈ విషయం యువతి కుటుంబసభ్యులకు తెలియకుండా జరిగింది. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి ఇటీవల విషమంగా మారింది. దీంతో కుటుంబసభ్యులు గురువారం రాత్రి బలంగిలో భీమ్‌వోయి మెడికల్ కాలేజీలో చేర్పించారు. అక్కడ సీటీ స్కాన్‌లో యువతి తలలో అనేక సూదులు ఉన్నట్లు తేలింది.

అనంతరం బర్ల భీంసార్‌లో ఉన్న VIMSARకు తరలించారు. అక్కడ 10 మంది సభ్యులతో కూడిన వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి యువతి తల నుంచి 70 సూదులను బయటకు తీశారు. "4 సంవత్సరాల క్రితం యువతి అనారోగ్యానికి గురైంది. ఆ సమయంలో తాంత్రికుడి వద్దకు తీసుకెళ్లారు కుటుంబసభ్యులు. యువతి తలపైనుంచి లోపలకు ఒక్కొక్కటిగా సూదులు చొప్పించాడు. ఇది నాలుగేళ్లుగా జరుగుతోంది. యువతి ఆరోగ్యం విషమించడం వల్ల ఆస్పత్రికి తీసుకురాగా శస్త్ర చికిత్స చేసి 70 సూదులు తొలగించారు వైద్యులు. దాదాపు 2 గంటల పాటు సర్జరీ జరిగింది" అని డాక్టర్లు తెలిపారు.





## రైతుల రుణమాఫీ సందర్భంగా..

# సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**పటాన్ చెరు,విశాలభారతి:** పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆదేశం మేరకు రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ ప్రకారం రైతుల రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శివాలయం చౌరస్తాలో అమీన్ పూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి. శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొల్లూరి మల్లేష్, యూసుఫ్, సద్దుల మల్లేష్, ఉపాధ్యక్షుడు మన్నె రవీందర్, బీరంగూడ శివాలయం చైర్మన్ సుధాకర్, రమేష్ యాదవ్, కుమ్మరి మహేష్, సతీష్, భిక్షపతి, భవానీపూర్ శంకర్, మహిపాల్ రెడ్డి, శరత్, పెద్ద మల్లేష్, గోపాల్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, కృష్ణా యాదవ్, బిల్లి శ్రీనివాస్, ఇక్రిశాట్ మల్లేష్, ఇక్రిశాట్ మహేష్, ఎల్లయ్య, మల్లేష్, దీపక్, ప్రవీణ్, సిద్దు, శరత్, ఈశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాగేష్ మరియు కె.ఎస్.జి. సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఆదిభట్ల మున్సిపాలిటి చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగులూరు గంగా నగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి పర్యటించి ఆరోగ్యం, విద్య, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇండ్ల మధ్యలో ఉన్న చెత్తను, చెదారాన్ని మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా చైర్మన్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ...రానున్నది వర్షా కాలమని పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని అన్నారు. ప్రజలందరూ కూడా వీధులు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలన్నారు. కాలనీలలో దోమల బెడదను నివారించేందుకు ఫాగింగ్ (స్ప్రే) చేయాలని, వర్షపు నీరు, చెత్తా, చెదారం, మురుగును ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. బొంగులూరు గేట్ నుండి పటేల్ గూడా వరకు వెళ్లే ప్రధాన రహదారి పనులను బోనాల పండుగ వరకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ కుంట్ల మౌనిక ఉదయపాల్ రెడ్డి, ఏఈ వీరాంజనేయులు, వర్క్ ఇన్స్పెక్టర్ జాన్సన్, సురేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మధ్యాహ్న భోజన కార్మికుల పోరుబాట

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు యెలమోని స్వప్న
- మంచాలలో కొనసాగుతున్న కార్మికుల రిలే దీక్షలు

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** మధ్యాహ్న భోజన కార్మికులు పోరుబాట పట్టారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు ఇవ్వకూడదని, పెండింగులో ఉన్న బిల్లులు వేతనాలు వెంటనే ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు యెలమోని స్వప్న డిమాండ్ చేశారు. శుక్రవారం పెండింగులో ఉన్న బిల్లులు వేతనాలు ఇవ్వాలని, వంట పనిని ప్రైవేటు సంస్థలకు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 5 వ రోజు మంచాల మండల కేంద్రంలో ఆమె పాల్గొని ప్రసంగించారు...మధ్యాహ్న భోజన పథకంలో 22 సంవత్సరాల నుండి పని చేస్తున్నారని, డ్వాక్రా సంఘాల నుండి మహిళలను ఈ పథకంలోకి తీసుకున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2400 మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. ఏళ్ల తరబడి కార్మికులు బిల్లులు వేతనాలు సకాలంలో రాకపోయినా అప్పులు చేసి వంటలు చేసి పెడుతున్నామని అన్నారు. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు ఇస్తే వారంతా రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో అక్షయ పాత్ర సంస్థకు ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు ఇస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందు ఎన్నికల ముందు మా ప్రభుత్వం వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తానని హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టారనీ గుర్తు చేశారు. ప్రైవేటు సంస్థలకు ఇచ్చేది లేదని చెప్పి ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు రంగారెడ్డి జిల్లాలో ఏడు మండలాలు అక్షయపాత్రకు ఇవ్వాలనుకొంటుందని విమర్శించారు. పెండింగ్లో ఉన్న బిల్లులు వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కోశాధికారి సరిత, నాయకులు అలివేలు, లక్ష్మమ్మ, జంగమ్మ, మస్రు, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్లో జోనల్ కమిషనర్ పర్యటన



**నాచారం,విశాల భారతి:** మల్లాపూర్ డివిజన్లోని ఓల్డ్ మల్లాపూర్ లో జిహెచ్ఎంసి ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటిల్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్లోని వివిధ సమస్యల పరిష్కారానికి నిధులు ఓల్డ్ మల్లాపూర్ వివిధ బస్తీలల్లో సిసి రోడ్లు, కౌండిన్య భవన్లో పెండింగ్ పనులు, మోడరన్ దోబీఘాట్, సంజయ్ పార్కులో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు పార్కును అందుబాటులో తీసుకురావాలని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువస్తు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వీలైనంత త్వరగా వివిధ పనులకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఈ ఈ హరిలాల్, డి ఈ రవీందర్, ఏఈ శ్రవంతి, ఇతర విభాగాల అధికారులు, మరియు స్థానికులు పైళ్ల ప్రవీణ్, తండా వాసు గౌడ్, ఉస్మాన్ పాల్గొన్నారు.



# కామర్స్ విద్యార్థులు ఇంజనీరింగ్ వాళ్ళతో పోటీపడుతున్నారు

- ఉన్నత విద్యా మందిర్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి
- ఘనంగా ఓయూ వాణిజ్య విభాగం వాణిజ్య - 2024



**సికింద్రాబాద్, విశాలభారతి:** కామర్స్ విద్యార్థులు విద్య ఉపాధి అవకాశాలలో ఇంజనీరింగ్ కళాశాలకు విద్యార్థులకు దీటుగా అవకాశాలు అందుకు అందిపుచ్చుకుంటున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి అన్నారు. శుక్రవారం ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో జరిగిన వాణిజ్య 2024 కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీ అండ్ పీజీ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో అయిన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలాన్ని గుణంగా దూరవిద్య మరియు ఒకేషనల్ విద్య ద్వారా కంప్యూటర్ అనుసంధానంతో విద్యా విధానాన్ని బోధనగా మార్చుకోవాలని సూచించారు. కామర్స్ విభాగం ప్రతి సంవత్సరం వినూత్న పద్ధతిలో ప్రేరణ పేరుతో డిగ్రీ విద్యార్థులకు , వాణిజ్య పేరుతో పిజి విద్యార్థులకు , వారి వారి సబ్జెక్ట్ పై పోటీ పరీక్షలు నిర్వహించి వారిలో దాగివున్న నైపుణ్యతలను వెలికి తీయడం హర్షణీయం అన్నారు. రాష్ట్ర గ్రంధాలయాల పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ మన వ్యాపార వ్యాణిజ్యలు ప్రపంచ నలు మూలల వ్యాపించిందని ఒక్కసారి చరిత్ర గమనిస్తే కరీంనగర్ , నిజామాబాద్ ప్రాంతల నుండి వ్యాపారాలు అరబ్ దేశాలలో సైతం నిర్వహించారని, దేశంలో ఏషియాలో ట్రేడింగ్ సెంటర్ పాయింట్ గా సెంటర్ గా మారిందన్నారు. ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఉత్పత్తిలో నెంబర్ వన్ గా మారి ఏషియా మొత్తానికి మహారాజుల , మహారాణిల వెలుగొందుతుందన్నారు.దానికి కారణం నిపుణులైన విద్యార్థులు మీ విభాగం నుండి రావడమే దీనికి కారణం అన్నారు. కామర్స్ విభాగం హెడ్ వాణిజ్య చైర్మన్ సీనియర్ ప్రొపెసర్ దాసరి చిన్నప్ప మాట్లాడుతూ. ఈ ప్రోగ్రాం గత కొన్ని సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా కొనసాగిస్తూ పిల్లల్ని ఉత్తేజపరుస్తూ , పిల్లలకు కావలసిన సాంకేతిక నైపుణ్యం పెంపుకై పారిశ్రామిక రంగాన్ని యూనివర్సిటీ కి అనుసంధానిస్తు వారికి కావాల్సిన సాంకేతిక మేలుకువాలు నేర్చుకోవడానికి విద్యార్థులు పోటీ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ఉద్యోగాలకు అర్హత సంపాదించడానికి ఈ వాణిజ్యం 2024 పోగ్రాం ఎంతో చేస్తుందని ప్రొఫెసర్ చిన్నప్ప ధీమా వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో ఇలాంటి పోటీలు నిర్వహించే అంశాల్లో పాల్గొని విద్యార్థులు ఎలాంటి దురాలవాట్లకు ప్రధానంగా ర్యాగింగ్ , డ్రగ్స్ , ధూమపానం , మద్యపానం ,లకు దూరంగా ఉంటూ బావి భారత పౌరులుగా తీర్చి తీర్చిదిద్దడం కార్యక్రమా ప్రధాన ఉద్దేశం అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు యూనివర్సిటీలో 8 యం.కామ్ విద్యార్థులు, 6 పీజీ కళాశాలల విద్యార్థులు , విద్యార్థిని విద్యార్థులు 312 మంది విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటారు. విద్యార్థులే ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని విభాగం అధ్యాపకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో VSX యం.ఎన్ సి , జనరల్ మేనేజర్ డా. సూర్య ప్రవీణ్ మరియు ఎంవి నర్సింగ్ రావు ఫౌండర్ చైర్మన్ అండ్ సీఈవో లు ఓయూ విద్యార్థులకు ఇంటెన్షిప్స్ తో పాటుగా ఉద్యోగ అవకాశాలు ఇవ్వడానికి ముందుకు రావడం విశేషం. ఈ కార్యక్రమంలో కామర్స్ డీన్ ప్రొఫెసర్ ఎం. గంగాధర్ కామర్స్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కె కృష్ణచైతన్య , కన్వీనర్ ఇంద్రకంటి శేఖర్ , కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు విభాగం అధ్యపకులు , ఉద్యోగులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

- గ్రూప్ 2 అభ్యర్థుల విజ్ఞప్తితో డిసెంబర్ వరకు వాయిదా
- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

**సికింద్రాబాద్, విశాలభారతి:** త్వరలో జాబ్ క్యాలండర్ తో ఉద్యోగాల భర్తీ చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు.శుక్రవారం సాయంత్రం ఓయు ఆర్ట్స్ కళాశాల ఎదుట సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. డీఎస్సీ, గ్రూప్ పరీక్ష మధ్య వ్యవధి కావాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుద్యోగులకు అవకాశం కల్పించారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో విడుదల చేస్తుందని అన్నారు. డీఎస్సీ 11 వేల పోస్టులు భర్తీ చేస్తుందన్నారు. నిరుద్యోగులను బిఆర్ఎస్ పార్టీ విచ్చినం చేయాలని కుట్ర చేసిన నిరుద్యోగులు నమ్మలేదు అన్నారు.ఈ కార్యక్రమంలో ఓయూ ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడు, మెడ శ్రీను, వినయ్, ఓయూ జాక్ రాజేష్ ,సురేష్ ,విద్యార్థులు పాల్గొన్నారు.



## జంగా రాఘవరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**దేవరుప్పుల, విశాల భారతి** తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులయిన జంగా రాఘవ రెడ్డిని వారి నివాసంలో ఉస్మానియా జేఏసీ నేత ఇప్ప పృథ్వీ రెడ్డి,దేవరుప్పుల మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు తాళ్ళపెల్లి వేణు కలిశారు. చైర్మన్ గా నియామకం అయినందున వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం ద్వారా రైతు పక్షపాత ప్రభుత్వం అని నిరూపించుకున్నదని,త్వరలోనే మరిన్ని పథకాలు అమలు అవుతాయని,మరో 20 ఏండ్ల వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని జంగా రాఘవ రెడ్డి అన్నారు. జంగాను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు కొంగరి రాములు,జోగు నర్సయ్య,బత్తిని భాస్కర్,రాపాక లక్ష్మణ్, తదితరులున్నారు.





# రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లకు సన్మానం

- కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

**బాల్కొండ, విశాల భారతి:** గతంలో కెసిఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయక విద్య, వైద్య వ్యవసాయ రంగాలను నిర్వీర్యం చేస్తూ కేవలం దోచుకోవడమే పనిగా పెట్టుకున్నాడని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని భీంగల్ మండల కేంద్రంలోని సహస్ర గార్డెన్ లో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు అనిల్ ఈరవత్రి,మానాల మోహన్ రెడ్డి,అన్వేష్ రెడ్డి,తహెర్ బిన్ హందాన్ లని నియోజకవర్గం నాయకులు,కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి,బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు మేలు చేసే విధంగా రుణమాఫి చేసిందని, ఇప్పటికే మొదటి విడత రుణమాఫీ ప్రారంభం అయ్యిందని అన్నారు. మాట ఇచ్చిన విధంగా ప్రజల భూములు ప్రజలకు చెందాలని అధికారుల వద్ద సమస్యలు పరిష్కరించే విధంగా సిఎం రేవంత్ రెడ్డి కార్యాచరణ సిద్ధం చేశారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారంగా జిల్లాలో 44,600 కుటుంబాలకు లక్ష లోపు రుణమాఫి చేశారని,అదేవిధంగా ఆగష్టు 15 వరకు 2 లక్షల రుణమాఫి చేస్తామని తెలిపారు. విద్య రంగంలో ప్రైవేట్ పాఠశాలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విదంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. అనంతరం ఖనీజాభివృద్ధి చైర్మన్ అనిల్ ఈరవత్రి మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేకున్నా కార్యకర్తలు పడ్డ కష్టాలను చూశామని అన్నారు. అవకాశాలు వచ్చిన పార్టీ వదలని నేత సుదర్శన్ రెడ్డి అని అన్నారు. ఎప్పుడికి కాంగ్రెస్ కార్యకర్తలను వదిలి పెట్టమని హామీ ఇచ్చారు. కెసిఆర్ ని ఎదుర్కోవాలంటే అది కేవలం సిఎం రేవంత్ రెడ్డి వల్లనే సాధ్యమని ప్రజలు నమ్మితే దాని విశ్వశించిన సుదర్శన్ రెడ్డి,మానాల మోహన్ రెడ్డి,నేను రేవంత్ రెడ్డి పక్షాన నిలబడి సరైన నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు ఎంతో అద్భుతమైన రోజు అని,ఎన్నటికీ మరువలేనిదని అన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వల్ల తన జీవితమే రాజకీయంగా మలుపు తిరిగిందని,తనకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా అవకాశం ఇచ్చారని అన్నారు. బాల్కొండ నియోజకవర్గం నాయకులు తనకు ఎంతో సంహరించారాని, నిజామాబాద్ లో చేసిన ప్రతి పోరాటానికి బాల్కొండ నుండి అనేక మంది వచ్చి నా విజయంలో పాలుపంచుకున్నారని అన్నారు. ఉర్దు ఆకడామీ చైర్మన్ తహేర్ బిన్ హందన్ మాట్లాడుతూ ఈ రోజు చేస్తున్న సన్మానం ప్రతి కార్యకర్తకు చెందుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాట తప్పకుండ రైతు రుణమాఫి చేశారు. రాబోయే కాలంలో సిఎం రేవంత్ రెడ్డి కార్యకర్తలు అండగా ఉంటారని తెలిపారు. వితనాభివృద్ధి చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ తనకు పదవి వచ్చింది అంటే ఆది కార్యకర్తల గొప్పతనమే అని,కిసాన్ కాంగ్రెస్ విభాగంలో రైతు సమస్యల పట్ల చేసిన పోరాటాలు చూసే కాంగ్రెస్ పార్టీ నాకు పదవి ఇచ్చిందని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి,eగొర్త రాజేందర్, నిజామాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, నియోజకవర్గం మండల కాంగ్రెస్ అధ్యక్షులు స్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా అరికట్టండి

- జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పటేల్ చెరువు పరిసరాలను డీసీ వంశీకృష్ణ ఇతర అధికారులతో కలిసి జెడ్సి ఉపేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు కుంటలు శుద్ధ జలాలలో నిండాలే తప్ప మురుగు నీటితో కాదని శేరిలింగంపల్లి జడ్సీ ఉపేందర్‌రెడ్డి అన్నారు. డ్రైనేజీల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులలోకి వెళ్లకుండా పటిష్టమైన, నియంత్రణ చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ , శేరిలింగంపల్లి సర్కిళలో మల్కం చెరువు, పటేల్ చెరువు, మియాపూర్ చెరువు, గంగారం పెద్ద చెరువు, ఖాయిదమ్మ కుంటలను అధికారులతో కలిసి జడ్సీ పర్యటించి చెరువులను పరిశీలించారు.అనంతరం ఖాజాగూడ, గచ్చిబౌలి, లింగంపల్లి ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆయన తనిఖీ చేసారు.మురుగు నీరు చెరువుల్లోకి చేరకుండా డైవర్షన్ ఛానళ్ల ద్వారా డ్రైనేజీలలోకి మళ్లించాలని,అందుకు సంబంధించిన సమగ్ర నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు.పరిశుభ్రమైన నీరు చెరువులలోకి చేరేలా తూములు, ఛానళ్లను నిర్మించాలన్నారు.చెరువులలో పేరుకుంటున్న గుర్రపు డెక్కను తొలగించాలని,దోమల వ్యాప్తి నివారణకు చర్యలు చేపట్టాలని ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువు పరిసరాల నివాసితులను భాగస్వాములను చేస్తూ దోమల నివారణ బాల్స్‌ను వారితో వేయించాలన్నారు. పరివాహక ప్రజలు వ్యర్థాలు చెరువులలో వెయ్యవద్దని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే దోమల వ్యాప్తి జరదన్నారు. విలువైన చెరువు స్థలాలు కబ్జాకు గురికాకుండా నోడల్ అధికారులు అనునిత్యం పర్యవేక్షణ చేపట్టాలని జడ్సీ ఆదేశించారు.పారిశుద్ధ్య పనులలో మరింత పురోగతి నెలకొనాలని, వ్యర్థాలను ఎప్పటికపుడు తరలించాలని జడ్సీ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు.ఆయన వెంట ఏసీ లేక్స్ శివకుమార్ నాయుడు, డీసీలు వంశీకృష్ణ, రజనీకాంత్‌రెడ్డి,ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం, ఇరిగేషన్ అధికారులున్నారు.



## ఎర్ర జెండా పేద ప్రజల ప్రాణ వాయువు

- జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**పాలకీడు, విశాలభారతి:** ఎర్రజెండా పేద ప్రజల ప్రాణవాయువు అని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం 19 జూలై నేరేడుచర్లలో జరిగిన సిపిఐ నేరేడుచర్ల పాలకవీడు మండలాల కౌన్సిల్ సమావేశం క ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు లేని, తన, మన అనే స్వార్థం లేని ఒక నూతన సమాజం నిర్మించాలన్నదే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని, ప్రకృతి ఇచ్చిన భూమి పైన అందరికీ హక్కు ఉండాలని, ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర ఫలాలు పేద ప్రజల దరిచేరకుండా బూర్జువా పార్టీల నేతలు తన్నుకు పోతున్నారని, దేశ సంపద కేవలం 10 శాతం మంది వద్ద పోగుబడి పోతున్నదని కేంద్రంలో గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం పెట్టుబడిదారి వర్గాలకు తొత్తులుగా మారి దేశ సంపదను అంబానీ ఆధానీ లాంటి కార్పోరేట్ శక్తులకు ధారపోస్తున్నారని వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని ఎత్తి వేసేందుకు నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతున్నదని, ఎన్నో పోరాటాలు చేసి 44 కార్మిక చట్టాలు సాధించుకుంటే వాటిని కుదించి నాలుగు కోడ్ లుగా మార్చిందని, వీటన్నింటి పైన వామపక్ష పార్టీలు పోరాటం చేస్తున్నాయని అన్నారు. సమావేశానికి రావుల సత్యం అధ్యక్షత వహించగా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, మండల సిపిఐ కార్యదర్శి యల్ల బోయిన సింహాద్రి, పట్టణ సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ లక్ష్మి పాల్గొన్నారు.




## దోమల నివారణకై అందరూ జాగ్రత్తలు పాటించాలి

- కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్

**ఎల్బీనగర్, విశాలభారతి:** దోమల నివారణ కోసం ప్రతి నివాసగృహస్తులు జాగ్రత్తలు పాటించాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా జిహెచ్ఎంసి ఎంటమాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గృహస్తులు తమ ఇంటి ముందు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు ఎక్కువగా ఉంటాయి అన్నారు. ఖాళీ స్థలాలలో చెత్త చెదారాన్ని వేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాలనీవాసుల పై ఉందన్నారు. ఇంటి ముందు చెట్ల మధ్యలో కవర్లు పేపర్లు పడి నీరు ఉండడం వల్ల దోమలు అభివృద్ధి చెందుతాయని అలాంటి పరిస్థితి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సతీష్ గౌడ్ ,నరసింహ, గంధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మాదాపూర్ డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించండి

- సిపిఐ నాయకులు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఇజ్జత్ నగర్ వీకర్ సెక్షన్ లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిహెచ్ఎంసి చందానగర్21 సర్కిల్ డిసి వంశీ కృష్ణకి శేరిలింగంపల్లి సిపిఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మాదాపూర్ డివిజన్ లో నెలకొన్న వివిధ సమస్యలపై అదేవిధంగా ఇజ్జత్ నగర్ స్పీకర్ సెక్షన్ లో చెప్పటాల్సిన పలు అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని వారు కోరారు. సనుకూలంగా స్పందించిన డిసి వంశీకృష్ణ ఆయా ప్రాంతాల్లో పర్యటించే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ శేరిలింగంపల్లి కార్యదర్శి టి. రామకృష్ణ,రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి చందు యాదవ్, శేరిలింగంపల్లి ఏఐటియుసి అధ్యక్షుడు తుపాకుల రాములు, ఇజ్జతనగర్ కార్యదర్శి వెంకటేష్,ఏఐవైఎఫ్ అధ్యక్షులు జే శ్రీనివాస్,దళిత కుల పోరాట సంఘం మండల కార్యదర్శి ఎస్ కొండల్,తదితరులు పాల్గొన్నారు.



## పెంచికల్ దిన గ్రామంలో అమ్మమాట కార్యక్రమం

**పాలకీడు, విశాలభారతి:** పెంచికల్ దిన గ్రామ పంచాయతీలోని అంగన్వాడి 1,2,3 కేంద్రాల్లోని జాతీయ నూతన విద్యా విధానంలో మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమ్మ మాట అగన్వాడి బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం అలాగే ఆరు సంవత్సరాల పిల్లలకు ఉచిత విద్య కార్యక్రమం విధానం తెచ్చింది. పిల్లలను ప్రైవేట్ స్కూల్ కు పంపించకుండా ప్రభుత్వం ఇస్తున్నటువంటి పౌష్టికాహారం ఉచిత విద్యను ఉపయోగించుకోవాలని, ఐసిడిఎస్ హుజూర్నగర్ ప్రాజెక్టు పెంచికల్ దిన్న సెక్టర్ సూపర్వైజర్ ఏ యశోద కోరారు.

## రైతు రుణమాఫీ నిర్ణయం చారిత్రాత్మకం

- కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నా ముదిరాజ్



**పటాన్ చెరు,విశాలభారతి:** రైతులకు రుణమాఫీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నా ముదిరాజ్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందని చెప్పారు. రుణమాఫీని అమలు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ రైతు సంరక్షణ సమితి అధ్యక్షులు రాష్ట్ర సింగిరెడ్డి భాస్కర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామంటే హేళన చేసిన బిఆర్ఎస్ నేతలు, ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు రాజీనామా పత్రం సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీ వరంగల్ సభలో రైతులకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడం జరిగిందన్నారు. హరీష్ రావు రాజీనామా చేయడంతో పాటు మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయననే మాటకు కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు. ఎక్కడ ఎప్పుడు లేని విధంగా దేశంలోనే తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే రోజు 7000 కోట్లు 11లక్షల 50 వేల మంది రైతులకు లక్షలోపు రుణంమాఫీ చేసి ఆ మొత్తాన్ని రైతులు బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని చిన్నా ముదిరాజ్ తెలిపారు.

## దేశంలోనే చారిత్రాత్మకం రేవంత్ రెడ్డి సర్కార్ రైతు రుణమాఫీ

- ఒకే విడతలో 31 వేల కోట్ల రూపాయల రుణమాఫీ
- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సూదిని నరేందర్ రెడ్డి.



**ఎల్బీనగర్, విశాలభారతి :** దేశంలోనే మొట్టమొదటిసారిగా రైతుల సంక్షేమం కోసం ఒకే విడతలో 31 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సూదిని నరేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రైతు రుణమాఫీ ప్రక్రియలో మొదటి విడతలో లక్ష రూపాయలలోపు రుణాలను మాఫీ చేసిన శుభసందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్ లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీకి అనుగుణంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 31వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలను మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ఆగస్టు నెలాఖరులోపు రెండు లక్షల రూపాయల లోపు రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తోందని ఆయన తెలిపారు.గతంలో రాజశేఖర్ రెడ్డి రైతుల మీద చూపిన అభిమానం తర్వాత రేవంత్ రెడ్డికి ఆ గౌరవం దక్కింది అని కొనియాడారు రైతుల క్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీ సేవలు అందిస్తున్న శుభ సందర్భంలో ఆయన రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.




## పంచాయితీ రాజ్ చట్టంపై అవగాహన సదస్సు

**వాజేడు, విశాలభారతి:** చెరుకూరు గ్రామంలో స్థానిక స్వపరిపాలన మరియు పంచాయితీ రాజ్ చట్టం పైన అవగాహన సదస్సు కాఫెడ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ మదనయ్య. ఏ.ఎన్.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి హాజరైనారు ఈ అవగాహన సదస్సులో నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ సమర్థవంతంగా వుండాలంటే దేశ ప్రజలు పరిపాలనలో భాగస్వామం ఉండాలి. మారుమూల ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ ఫలాలు అందరికీ అందాలంటే పరిపాలన పరిపాలనా అధికార వికేంద్రీకరణం చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకని స్థానిక స్వపరిపాలన విధానం ఏర్పాటైంది అని తెలియచేయం జరిగింది పంచాయతీ రాజ్ సంస్థలు గ్రామ స్థానిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. ఇది గ్రామాల అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది, ముఖ్యంగా ప్రాథమిక విద్య, ఆరోగ్యం, వ్యవసాయ అభివృద్ధి, మహిళలు మరియు పిల్లల అభివృద్ధి మరియు స్థానిక ప్రభుత్వంలో మహిళల భాగస్వామ్యం మొదలైనవి అని తెలియజేశారు. అదేవిధంగా మీ పంచాయతీలో గ్రామ సభ జరుగుతున్నప్పుడు అందరూ గ్రామసభలో పాల్గొని మీ గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే గ్రామ సభలో చర్చించి పరిష్కారం అయ్యే విధంగా గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లండి అని అవగాహన కల్పించారు.

## ఐఐటీ జామ్‌లో ప్రతిభ చాటిన గీతం విద్యార్థిని రీతి దత్తా



**పటాన్ చెరు,విశాలభారతి:** హైదరాబాద్ లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని బీఎస్సీ స్టాటిస్టిక్స్ విద్యార్థిని రీతి దత్తా చౌధురి ఎమ్మెస్సీలో ప్రవేశం కోసం నిర్వహించిన ఐఐటీ జాయింట్ అడ్మిషన్ టెస్ట్ లో 333 అఖిల భారత ర్యాంక్ సాధించింది. దీనితో పాటు, సీయూఈటీ పీజీ పరీక్షలో కూడా ఆమె ప్రతిభ కనబరిచి, మనదేశంలోని అనేక ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలలో ప్రవేశానికి మార్గం సుగమం చేసింది. రీతి యొక్క అత్యుత్తమ ప్రదర్శన హైదరాబాద్ విశ్వవిద్యాలయం (15వ ర్యాంకు), బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, పాండిచ్చేరి విశ్వవిద్యాలయం (10వ ర్యాంకు), తమిళనాడులోని కేంద్రీయ విశ్వవిద్యాలయం (1వ) ర్యాంకు)తో సహా అగ్రశ్రేణి సంస్థలలో ఆమెకు సీట్లను సంపాదించి పెట్టింది. ఇది ఆమె విద్యా నైపుణ్యాన్ని ఎత్తిచూపడమే గాక, స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణితశాస్త్ర విభాగం అందిస్తున్న అత్యుత్తము విద్యకు కూడా నిదర్శనంగా నిలుస్తోంది. గీతం విశ్వవిద్యాలయంలోని అధ్యాపకుల నుంచి తనకు లభించిన అమూల్య ముద్దతు, మార్గదర్శకత్వానికి రీతి దత్తా కృతజ్ఞతలు తెలియజేశారు. 'నా' ఆధ్యాపకుల తిరుగులేని ముద్దతు, మార్గదర్శనం లేకుండా ఈ విజయం సాధ్యం కాదు. వారి అంకితభావం, ప్రోత్సాహం నా విద్యా ప్రయాణానికి మూలస్తంభంగా ఉన్నాయి. నా లక్ష్యాల కోసం శ్రద్ధగా పనిచేయడానికి నాకు శక్తినిస్తాయి' అని ఆమె పేర్కొన్నారు. మంచి ర్యాంకు సాధించిన రీతి దత్తాను గీతం. ఉన్నతాధికారులు, అధ్యాపకులు, సహచర విద్యార్థులు ప్రశంసించారు.

## గంజాయి నిర్మూలనలో అధికారులు కలిసి పనిచేయాలి

■ జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్




**సూర్యాపేట, విశాలభారతి** గంజాయి నిర్మూలనలో పోలీస్ , ఎక్సైజ్ శాఖలు జట్టుగా కలిసి పని చేయాలని జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నందు నిర్వహించిన పోలీసు అధికారుల సమీక్షా సమావేశం నందు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుతం డ్రగ్స్, గంజాయి చాలా ప్రధాన సమస్యగా ఉన్నదని , దీని మూలాలను తొలగించి నిర్మూలించడం ప్రధానమైనదని అన్నారు. డ్రగ్స్ పౌరుల సమాజిక, ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రమాదకరమైనది, డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి, డీజీపీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని అన్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో టీమ్ వర్క్ చేయాలని , గంజాయి పై సమాచారాన్ని, ఇంటలిజెన్స్ ను, నేరస్తుల సమాచారాన్ని ఇరు శాఖలు పరస్పరం చెరవేసుకుని గంజాయి నిర్మూలనకు పని చేయాలని కోరారు. సూర్యాపేట జిల్లాలో ఇప్పటివరకు డ్రగ్స్ విషయంలో గంజాయి ఎక్కువ మొత్తంలో సీజ్ చేశామని, గంజాయి రవాణా చేసే వారిని, వినియోగించే వారిని, అమ్మకాలు చేసే వారిపై కేసు నమోదు చేయడం చేశామని అన్నారు. ప్రతి నెల మూడవ బుధవారం రోజున యాంటీ డ్రగ్స్ డేగా ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. అనంతరం కేసుల నమోదు, పెండింగ్ కేసుల రికార్డ్స్ పరిశీలించారు. కొత్త న్యాయ చట్టాలపై నైపుణ్యం సాధించాలి కేసుల నమోదులో అవసరమైతే సిఐడి ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సహాయం తీసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తుల కదలికలు గమనించాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి, జాతీయ రహదారి 65 వెంట ఉన్న గ్రామాల ప్రజల్లో రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్ధన్ రెడ్డి, ఎక్సైజ్ సూపింటెండెంట్ లక్ష్మా నాయక్, డీఎస్పీ లు రవి, శ్రీధర్ రెడ్డి, మట్టయ్య, శ్రీనివాస రావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, ఎక్సైజ్ ఇనస్పెక్టర్ లు, ఎస్ ఐ పాల్గొన్నారు.

# వడివడిగా వరినాట్లు

■ వరినాటు వేస్తున్న మహిళలు



**సైదాపూర్, విశాల భారతి** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు బోర్లు, బావుల్లో అవసరమైన మేరకు నీరుండడంతో వరినాట్లు ఊపందుకున్నాయి. మే,జూన్ నెలలో వర్షాలు లేకపోవడంతో సమయంలో నారు పోసిన రైతులు ఇప్పుడు నాట్లు వేస్తున్నారు. పూర్తి అనుకూల వాతావరణంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వరినాట్లు లేటుగానే పడుతున్నాయి. ఇదిలా ఉంటే డీజిల్ ధర పెంపు ప్రభావం సాగు రంగంపైనా పడింది. ట్రాక్టర్ యజమానులు కేజ్ వీల్స్‌తో దున్నుకానికి ఎకరకు రూ.6000 వరకు పెంచారు. అలాగే కూలి రేటూ రూ.500 పెరిగింది. ఏటికేడు సాగు ఖర్చులు భారీగా పెరుగుతున్నా పంట ఉత్పత్తుల రేట్లలో పెరుగుల లేదని రైతులు వాపోతున్నారు. నాలుగైదేళ్లుగా వర్షాలు సమృద్ధిగా పడి ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడం వలన బోర్లలో, బావులలో భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు 35రోజుల లేటుగానే వరినాట్లు వేస్తున్నారు. మూడు రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు వరినాటు పనుల్లో బిజీ అయ్యారు. సైదాపూర్, సోమారం, ఎగ్లాస్పూర్ తదితర గ్రామాల పరిధిలో బావులు, బోర్లకింద వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం దొడ్డు రకం, సన్న రకం పంట నాట్లు వేస్తున్నారు. మే, జూన్ నెలలో వర్షాలు లేకపోవడంతో అప్పుడు నారు పోసిన రైతులు ఇప్పుడు వరినాట్లు వేస్తున్నారు. భారీగా పెరిగిన సాగు ఖర్చులు డీజిల్ రేటు పెరగడంతో ఆ ప్రభావం వ్యవసాయ రంగంపైనా పడింది. గతంలో బురద దున్నుకానికి ఎకరాకు రూ.5000 చొప్పున తీసుకునేవారు. ప్రస్తుతం రూ.6000 పెంచారు. రెండు రూ.1000 పెంచినా నష్టమే వస్తోందని ట్రాక్టర్ల యజమానులు అంటున్నారు. దున్నుకం ఖర్చులు పెరగడం, డీఏపీ, ఇతర దుక్కి ఎరువుల ధర బస్తాకు రూ.1350పైగానే ఉండడంతో పెట్టుబడి ఖర్చులు ఎక్కువవుతున్నాయని, ప్రభుత్వం రైతుబంధు కింద ఇస్తున్న ఎకరానికి రూ.5వేలు సగానికి కూడా సరిపోవడం లేదని రైతులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్న సమయంలోనే రైతులంతా పనులు ముమ్మరం చేయడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో అవసరం ఉన్న రైతులు కొంత డబ్బు ఎక్కువైనా చెల్లించి పనులు చేయించుకుంటున్నారు.




## ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి

**నడిగూడెం, విశాలభారతి:** తాగునీటి కొరకు సాగర్ నీరు విడుదల చేసినందున ప్రజలు రైతులు కాలువలోకి దిగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. పశువులను కూడా కాలువ వైపు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని మండల పరిధిలోని గ్రామ ప్రజలకు రైతులకు ఎస్సై జి అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



## గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

■ ఎంపీడీవో ఎం రామారావు

**మరిపెడ, విశాల భారతి**: మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టి దోమల నివారణ చర్యలు తీసుకోవాలని మరిపెడ ఇన్చార్జి ఎంపీడీవో ఎం రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని గాలివారి గూడెం ,అబ్బాయి పాలెం, తదితర గ్రామపంచాయతీలలో ఆయన పర్యటించి గ్రామపంచాయతీ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధిలైట్లు వెలిగే విధంగా చూడాలని, పిచ్చి మొక్కల తొలగింపు చేసుకోవాలని, మంచినీటి కలుషితం కాకుండా జాగ్రత్తలు పడాలని, అవసరమైనంత బీ సింగ్ పౌడర్ ను అందుబాటులో ఉంచుకోవాలని, దోమల నివారణ కోసం పాకింగ్ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆయన ఆదేశించారు. మల్టీపర్పస్ వర్కర్స్ ఈ సీజన్ లో నిరంతరం గ్రామపంచాయతీకి అందుబాటులో ఉండాలని ఎలాంటి ప్రమాదాలు సంభవించిన స్పందించే విధంగా గ్రామపంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామాలలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ భాగస్వామ్యం చేసుకొని సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీలక్ష్మి, కరోబార్ యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ రాయల రవి, ఏఎన్ఎం బోడ విజయ, గ్రామస్తులు ఒంటి కొమ్ము దేవేందర్ రెడ్డి, జిన్నా లచ్చయ్య, ఆశా కార్యకర్తలు, రహేళ, మాధవి, గ్రామస్థాయి ఉద్యోగులు ఉన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

■ వైద్యాధికారి కారం మధు

**కరకగూడెం, విశాలభారతి:** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కరకగూడెం వైద్యాధికారి కారం మధు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలోని భాగంగా బట్టుపల్లి గ్రామపంచాయతీలో పలు వీధుల్లో తిరుగుతూ గ్రామస్తులు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. దోమల బెడద లేకుండా మురికి కుంటలు లేకుండా ఉండాలని సీజనల్ వ్యాధుల పట్ల ఎంతో అప్రమత్తంగా ఆయన సూచించారు. మండలం పరిధిలోని గ్రామస్తులు ఎటువంటి ఇబ్బందులు ఉన్న తక్షణమే వైద్యశాలను సంప్రదించాలని ఆయన సూచించారు. 24 గంటలు ప్రభుత్వ వైద్యశాల అందుబాటులో ఉంటుందని తెలిపారు. అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయ ని ప్రతి ఒక్కరు ప్రభుత్వ వైద్యశాలను వైద్యం చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎం లు, కృష్ణ, నరసింహారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల వలయాలుగా ప్రభుత్వ పాఠశాలలు

■ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి అక్కినపల్లి నాగేంద్రబాబు

**అశ్వాపురం, విశాలభారతి :** మండలం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ప్రభుత్వ విద్యా సంస్థలు సందర్శించాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగా శుక్రవారం నాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పినపాక నియోజకవర్గ కార్యదర్శి కార్యదర్శి అక్కినపల్లి నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యల వలయంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరేత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి కేటాయించకపోవడం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు పేరుతో అధికారంలోకి వచ్చి విద్యకు పెద్దపీట వేస్తామని చెప్పి ప్రభుత్వ సంస్థల సమస్యలు పరిష్కరించకుండా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠశాల రూములు లేక మంచినీరు లేక ఇబ్బంది పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా విద్యార్థుల పైన సవతి తల్లి ప్రేమ చూపిస్తుంది అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు ప్రభుత్వ విద్యా సంస్థలను కాపాడాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో పిల్లలు చేరే విధంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ విద్యని కాపాడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండలం నాయకులు అనిల్ కుమార్, సాయి, పునీత్ కుమార్ చరణ్ తదుతరులు పాల్గొన్నారు.



## బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి

■ ఎంపిడిఓకు వినతి

**దేవరుప్పుల, విశాల భారతి** దేవరుప్పుల మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బస్వ రాంచందర్ ఆద్వర్యంలో ఎంపిడిఓ లక్ష్మీ నారాయణను సీఐటీయూ మండల నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, రూ.5 లక్షల ఇన్స్యూరెన్స్ భకాన్ని అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హమీలను అమలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామ పంచాయితీలలో పనిచేస్తున్న సిబ్బందికి గత 5,6 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని,పంచాయితీ కార్మికులకు ఇచ్చేదే అతి తక్కువ వేతనాలు అవి కూడా నెలల తరబడి ఇవ్వకపోవడంతో కార్మికుల కుంటుబాలపై ఆర్ధిక భారం పడి అప్పుల పాలై చివరికి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని,తక్షనమే వేతనాలు చెల్లించాలని,గ్రామ పంచాయితీ సిబ్బందికీ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలు అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలతో పాటు ఇతర కార్మిక సంఘాలను ఐక్యం చేసుకొని రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు కూడా వెళ్తామని,సమ్మె కాలంలో ఏర్పడే ఇబ్బందులకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వినతి పత్రంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకట్ రెడ్డి, ఉప్పలయ్య, పరమేశ్, రమేష్, అశోక్,యాదగిరి,వెంకన్న,అంజయ్య,నర్సింహా, పరుషరాములు,తదితరులు పాల్గొన్నారు.



## జంతువులు కంటే హీనంగా ప్రజల బతుకులు

■ సరైన రోడ్డు లేవు, వీది లైట్లు లేవు
■ యాత్రలో భాగంగా కర్నె రవి వ్యాఖ్యలు

**మణుగూరు, విశాలభారతి:** మండలంలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రజల బాధలతో తల్లడిల్లుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన కాదు సమస్యల పాలన నడుస్తోందని మణుగూరుకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త అడ్వకేట్ కర్నె రవి తీవ్ర ఆరోపణలు చేశారు. సామాజిక కార్యకర్త కర్నె రవి ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం నాడు పల్లె యాత్రలో భాగంగా మణుగూరు మండలంలోని కట్టు మల్లారం గ్రామ పంచాయతీ లోని కే సి ఆర్ నగర్ లో పల్లెయాత్ర ప్రారంభించారు. ఈ యాత్రలో కర్నె రవి ప్రజలతో మాట్లాడి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రలో కే సి ఆర్ నగర్ ప్రజలు మల్లేపల్లి సింగరేణి భూ నిర్వాసితులు మైన మమ్మల్ని పట్టించుకున్న వాళ్ళు లేరు అని అన్నారు. గణేబోయిన గుంపు డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు ఉండే ప్రజలు పరిస్థితి వర్ణనాతీతం వర్షా కాలం మా పరిస్థితి జంతువులు కంటే హీనంగా ఉందని, ఇంటి చుట్టుపక్కల నీళ్ళు బురద మయంగా ఉందని, డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు వర్షానికి కురుస్తున్నాయి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బట్టిల గుంపు ఉండే ప్రజలకు విద్యుత్ సరఫరా లేదు సరైన రోడ్డు లేదు ఎంతో మంది రాజకీయ నాయకులకు చెప్పినా ఉపయోగం లేకుండా పోయింది అన్నారు.



## హక్కుల సాధనకై రోడ్డు ఎక్కిన ముదిరాజులు

■ ముదిరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలి

**డోర్నకల్, విశాలభారతి:** మండల కేంద్రంలో ముదిరాజ్ కుల బంధువులు అంతా కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. మరిపెడ వరంగల్ రూట్ లో ఉన్నటువంటి పెట్రోల్ బంక్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీతో స్లోగన్లతో కదిలి వచ్చి ఎమ్మార్వో కి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు చిల్ల సహదేవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలకు ముందు ఇచ్చినటువంటి హామీలు ఏవైతే ఉన్నాయో వాటన్నింటినీ తూచా, తప్పకుండా అమలు చేయాలి అని కోరారు. ముదిరాజులను బిసిడి నుండి ఏలోకి మార్చాలి అని డిమాండ్ చేశారు. ముదిరాజులకి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు, అలాగే జనాభా తమాషా పద్ధతి ప్రకారం రాష్ట్రంలోనే 13 శాతం ఎక్కువ జనాభా కలిగిన ముదిరాజులు పదవుల విషయానికి వచ్చేసరికి ఎక్కడో చివరి వరుసలో ఉంటున్నారు ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యేకి మంత్రి పదవి ఇవ్వాలి అని కోరారు. నామినేటెడ్ పోస్టులలో కూడా ముదిరాజ్ జనాభా ఎక్కువ సంఖ్య ఉంది కాబట్టి చాలా వరకు కార్పొరేషన్ చైర్మన్ లని ముదిరాజ్ లకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఎలాగైతే ముదిరాజులను అక్కున చేర్చుకొని వాహనాలు స్కూటీల లాంటివి ఇచ్చిందో అదే విధంగా కాంగ్రెస్ గవర్నమెంట్ కూడా ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ ,మరియు జిల్లా కార్యదర్శి పిట్టల ధనుంజయ్, మరిపెడ మండలం అధ్యక్షుడు బయ్య ఉపేందర్ సిపిఎం పార్టీ, మండల నాయకులు దుండి వీరన్న ముదిరాజ్ యువసేన, జిల్లా కార్యదర్శి సురబోయిన ప్రవీణ్ కుమార్, మరియు మండల నాయకులు వివిధ గ్రామాల సొసైటీ, సర్పంచులు, మెంబర్లు సభ్యులు పాల్గొన్నారు.



## కాలే కడుపులతో ఇంకెంతకాలం శ్రమ చేయాలి

■ మిషన్ భగీరథ వర్కర్స్ ఆవేదన
■ ఐదు నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ధర్నా

**నూతనకల్, విశాలభారతి:** 5 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని గత వారం క్రితమే ఏజెన్సీకి తెలియజేసిన పట్టించుకోవడంలేదని దీనితో జిల్లా కలెక్టర్కి, వాటర్ గ్రిడ్ ఈ ఈ అరుణాకర్ రెడ్డికి సమస్యలను తెలియజేయడం జరిగింది. అయినా ఏజెన్సీ వారు స్పందించకపోవడంతో ఈరోజు ఆ ప్లాంట్ ముందు మిషన్ భగీరథ కాంటాక్ట్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్( ఐ ఎఫ్ టి యు) జిల్లా సహాయ కార్యదర్శి మొగుళ్ల గోపాల్ పాల్గొని మాట్లాడుతూ ప్రతిసారి పెండింగ్ వేతనాల కోసం ఈ ప్లాంట్ ముందు ధర్నాలు చేయడం ఒక నెల రెండు నెలలు జీతం వేస్తూ చేతులు దులుపుకున్నాతున్నారు. ఈ విషయం పై అధికారులు, ఏజెన్సీ వారు ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన వేతనం చెల్లించకుండా అవి కూడా సకాలంలో అందజేయకపోవడంతో కార్మికులు, కార్మిక కుటుంబాలు అనేక ఆర్థిక సమస్యలతో అప్పులు చేస్తూ బ్రతుకు తెరువు వెళ్లదీస్తున్నాం అని , ఏజెన్సీకి ఎట్టి చాకిరి చేస్తున్నామని విమర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చంద్రయ్య, ఉపాధ్యక్షులు కూసు ఉప్పలయ్య, గంటా రామకృష్ణ, పగిండ్ల రాజు, లింగారెడ్డి, గురువయ్య, మహేష్,కటకం సైదులు,అనాంతుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మత్స్యశాఖ జిల్లా అధికారి



**సూర్యాపేట, విశాలభారతి** సూర్యాపేట జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఒక అవినీతి చేప చిక్కింది. జిల్లా మత్స్యశాఖ అధికారి టాగూర్ రూపేందర్ సింగ్ ఒక చాపల సొసైటీ సభ్యుడు నుండి 25,000 రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల చెరువులలో చేపలు పట్టుకొనుటకు సొసైటీకి అనుమతి ఇవ్వాల్సిందిగా సొసైటీ సభ్యులు జిల్లా మత్స్యశాఖ అధికారికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఫిషింగ్ కి అనుమతి ఇవ్వకుండా రూపేందర్ సింగ్ గత కొన్ని రోజులుగా తిప్పుతున్నాడు. రూ.25000 లంచం ఇస్తేనే ఫిషింగ్ ఆర్డర్ ని ఇస్తానంటూ చెప్పటంతో సొసైటీ సభ్యులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శుక్రవారం 25 వేల రూపాయలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని రిమాండ్ కి తరలించారు. అయితే 2016లో రూపేందర్ సింగ్ నిజామబాద్ జిల్లాలో పనిచేసిన సమయంలో 5 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కేసు కూడా ఉన్నది.గత రెండు సంవత్సరాలుగా సూర్యాపేట జిల్లాలో పనిచేస్తున్న ఇతనిపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నవి.

## హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలి



**భద్రాచలం విశాలభారతి:** హెల్త్ ఎమర్జెన్సీని తక్షణమే ప్రకటించాలని మహాజన సమితి మండల అధ్యక్షుడు చింత ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అశోక్ నగర్ కాలనీలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానల వల్ల భద్రాచలం పట్టణంలోని వివిధ కాలనీలు వర్షపు నీరుతో నిండి జిపజిబులాడుతుందని ఇల్లులన్ని తేమగా ఉండి దగ్గు జలుబు జ్వరాలు వస్తున్నాయని ఆయన అన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వలన దోమలు స్వైర విహారం చేస్తున్నాయని మలేరియా డెంగు వంటి ప్రమాదకరమైన జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని అంటువ్యాధులు కూడా సంభవించే పరిస్థితి ఉన్నదని దీన్ని దృష్టిలో పెట్టుకొని వైద్యశాఖ తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి వివిధ కాలనీలో వాటర్ డ్రైనేజీని శుభ్రం చేయాలని బ్లీచింగ్ చల్లాలని దోమల పిచికారిని స్ప్రే చేయాలని లేని పక్షంలో భద్రాచలం మొత్తం కూడా జబ్బులతో దర్శనమిచ్చే అవకాశం ఎక్కువగా కనిపిస్తున్నాయనీ పంచాయతీ అధికారులు తక్షణమే పారిశుద్ధ్య పనులు నిర్లక్ష్యం చేయకుండా కాలనీలలో చెత్త చెదారం మురుగునీరు నిల్వలు లేకుండా చేయాలని ఆయన అన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



■ ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

**ఆర్మూర్, విశాల భారతి** నందిపేట్ మండలంలోని ఉమ్మెడ, మాయాపూర్ గ్రామాలలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న నీటిని తీసివేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలం కావున నీటి నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని ఆశ వర్కర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు మీనా, లలిత తదితరులు పాల్గొన్నారు.



# సగం రుణమాఫీతో ఆర్భాటలు సంబరాలు

■ మోసానికి పెట్టింది పేరు కాంగ్రెస్ పార్టీనే

**వనపర్తి, విశాల భారతి::** కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ ఒకేసారి మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి రైతు భరోస ఎగ్గొట్టి కొంతమంది రైతులకు 6000వేల కోట్లతో ఒక లక్ష ఋణ మాఫీ చేయడం రైతులను మోసం చేయడమే అవుతుందని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 2లక్షల ఋణ మాఫీపై రైతాంగాన్ని మభ్యపెడుతుందని అన్నారు. రూ.6వేల కోట్లతో ఋణ మాఫీ అవుతుందా అని ప్రశ్నించారు. యాసంగి రైతుబంధులోనే రైతులకు రూ. 2వేల కోట్లు ఎగ్గొట్టి వానాకాలం రైతుబంధు గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. రైతులకు ఎకరాకు రూ.7500చొప్పున 10వేల కోట్లు ఎగ్గొట్టారని అన్నారు. కోటి 73లక్షల మహిళలకు 2500చొప్పున ఈ ప్రభుత్వం బాకీ పడింది. కౌలు రైతులకు ఇస్తామన్న రైతుబంధుకు కూడా ఈ ప్రభుత్వం తీలోకాలు ఇచ్చిందని వారు ఇచ్చిన మాట ప్రకారం ఒకే సమయములో రైతుబంధు, ఋణ మాఫీ,రైతు బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు నెలకు రెండు వేల చొప్పున,నిరుద్యోగులకు 4వేల చొప్పున,భూమి లేని కౌలు రైతులకు 15 వేల చొప్పున 6240కోట్లు ఇవ్వాలని, వరిధాన్యంపై 6500 కోట్ల బోనస్ అన్ని ఎగ్గొట్టి కేవలం 6వేల కోట్లతో ఒక లక్ష ఋణ మాఫీ చేసి చేతులు దులుపుకున్నారు అని అన్నారు. ఈ సమావేశంలో నందిమల్ల అశోక్, నాగన్న యాదవ్, సింగిల్ విండో ప్రెసిడెంట్ వాసుదేవా రెడ్డి, గంధం పరంజ్యోతి, స్టార్ రహీమ్,యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వన సంరక్షణ కమిటీ అధ్యక్షునికి సన్మానం

**ధర్పల్లి విశాల భారతి :**ధర్పల్లి మండలంలోని అటవిశాఖ సంరక్షణ అధ్యక్షునిగా సంబేటి సుమన్, ఉపాధ్యక్షునిగా మెగావత్ లక్ష్మణ్, కోశాధికారిగా సుధాకర్ ను వన సంరక్షణ కమిటీ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ధర్పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఇంజాపురం మహేందర్ నూతనంగా ఎన్నికైనటువంటి వన సంరక్షణ సమితి అధ్యక్షుడిని, కమిటీ సభ్యులని సన్మానించారు. అలాగే వన సంరక్షణ సమితి అధ్యక్షులు సంబేటి సుమన్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఇంజాపురం మహేందర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వన సంరక్షణ చైర్మన్ మాట్లాడుతూ.. అడవి తల్లి మైసమ్మకు ధూప దీప నైవేద్యాలతో అడవి ప్రాంతం, పంట పొలాలు పచ్చదనంతో భారీ వర్షాలతో నిండుకుండలా చెరువులు పొంగిపొర్లాలని అమ్మవారిని వన సంరక్షణ కమిటీ సభ్యులందరూ మొక్కులు కోరుతూ నైవేద్యం సమర్పించారు. వన సంరక్షణ కమిటీ సభ్యులందరూ ఏకమై గట్టు మైసమ్మ సమీపాన గల ప్రాంతంలో అడవిని నరికి నేలమట్టం చేసిన కబ్జా భూమిపై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వన సంరక్షణ కమిటీ సలహా దారులు రాయల్, తిరుపతి,ప్రవీణ్ గౌడ్, కార్యవర్గ సభ్యులు హరి,మోహిద్, రవికుమార్ తెడ్డు, పీసు రాములు,గంగరాజు, గంగ సాయిలు, గన్నారపు గంగారెడ్డి, అన్నారం రోహిత్,లోలం మహేందర్ పాల్గొన్నారు.



# వనమహోత్సవం ప్రారంభం

■ ప్రతి ఒక్కరు విధిగా చెట్లు నాటాలి

**ధర్పల్లి విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమం ఎంపీడీవో, ఎక్సైజ్, ఫారెస్ట్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వర్షాలు కురిసి, పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషంగా ఉండాలంటే చెట్లు నాటడం తప్పనిసరి కాబట్టి శుక్రవారం ఎంపీడీవో, ఫారెస్ట్, అక్బర్ శాఖ, కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘం ఆధ్వర్యంలో పవర్ హౌస్ వద్ద చెరువు కట్టమీద మూడు వేలకు పైగా ఈత చెట్లు, ఖర్జూర చెట్లు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అక్బరి శాఖ సిఐ వేణు, ఎంపీడీవో బాలకృష్ణ, ఏపీవో వినోద,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్, గ్రామ కార్యదర్శి సైపోద్దిన్,గౌడ సంఘం అధ్యక్షులు నిమ్మల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి

**వేల్పూర్ విశాల భారతి** వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాధికారి వి దుర్గాప్రసాద్ సందర్శించారు. ఇందులో భాగంగా పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు సమయ వేళలు పాటించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయ హాజరు పట్టికను పరిశీలించి పాఠశాలలో ఉన్న విద్యార్థుల అవసరాలపై ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా అధికారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట ఎంఈఓ వనజ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రఘునాథ్ తదితరులు ఉన్నారు.

# ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన రామంచ దర్గా

■ ఈనెల 21, 22న పెద్ద ఎత్తున ఉర్సు ఉత్సవాలు
■ దర్గా నిర్వాహకుడు మహమ్మద్ కరీంఖాన్..



**చిగురుమామిడి, విశాల భారతి:**కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచలో షా అబ్దుల్ రెహమాన్ జంగే షాహిద్ దర్గా సందల్ ఉత్సవాలు ఈనెల 21నుంచి నుండి ఘనంగా ప్రారంభం అవుతున్నట్లు దర్గా నిర్వాహకుడు మహమ్మద్ కరీం ఖాన్ తెలిపారు. జిల్లాలోనే రెండో అతిపెద్దదిగా పేరున్న ఈ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాను విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేసినట్లు చెప్పారు. దర్గాలో 21నరాత్రి నుంచి 22న వేకువజాము వరకు ప్రత్యేక ప్రార్ధనలు కొనసాగుతాయని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**దర్గా నేపథ్యం:**

దాదాపు 300ఏళ్ల క్రితం ఇస్లాం మత గురువు షా అబ్దుల్ రెహమాన్ ఈ ప్రాంతానికి వచ్చాడనీ,రామంచతో పాటు ఇతర గ్రామాల్లో తిరుగుతూ మత ప్రచారం చేస్తూ ఇక్కడే చనిపోయాడనీ, అప్పటి రామంచ గ్రామ పోలీస్ పటేల్ నర్ర గోపాల్ రెడ్డి తన పొలం నుంచి వ్యవసాయ పనులు చూసుకొని ఇంటికి వస్తుండగా ఒక చోట వెలుతురు కనిపించిందనీ, అదే చోట గోపాల్ రెడ్డి దర్గాను నిర్మించారని గ్రామస్తులు చెబుతుంటారు. అతని కుటుంబీకులు నర్ర వెంకట్ రెడ్డి, అతడి కుమారుడు నర్ర గోపాల్ రెడ్డి,నిర్వాహకుడు మహమ్మద్ కరీంఖాన్ ఆధ్వర్యంలో ఏటా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్ర, హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని గ్రామస్తులు తెలిపారు.

**గ్రామస్తుల సహకారంతో ఏటా నిర్వహిస్తున్నాం**

దర్గాకు వచ్చే భక్తుల కోసం, గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు కరీం ఖాన్ తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.




# ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కాపాడుకుందాం

■ యు.ఎస్.ఎఫ్.ఐ

**ధర్పల్లి విశాల భారతి,:** యునైటెడ్ భారత విద్యార్థి ఫెడరేషన్(USFI ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్పల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది సూరి మాట్లాడుతూ 2013 లో దర్పల్లి మండలంలో ఉన్న ప్రజలు, వీడీసీలు,విద్యార్థులు, మేధావులు అందరూ కలిసి అలుపెరగని పోరాటం చేస్తూ చివరికి ఆమరణ నిరాహార దీక్షలు కూడా చేపట్టి ధర్పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ను సాధించుకున్నారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పరిస్థితి రోజురోజుకు అగమ్యగోచరంగా తయారవుతున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అలాగే ఈ కాలేజీకి ఒక సంవత్సరం 360 మంది విద్యార్థుల ప్రవేశాల సంఖ్య తీసుకునే సామర్థ్యం ఉన్నప్పటికీ రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేనందున ప్రతి సంవత్సరం నూతన విద్యార్థుల అడ్మిషన్ సంఖ్య 80 కి మించకుండా పోతుందని అలాగే పర్మనెంట్ స్టాఫ్ కూడా లేని కాలేజీ నిర్వాహణ అస్తవ్యస్తంగా తయారయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆరు డిగ్రీ కోర్సులతో ప్రారంభమైన ఈ కళాశాలలో వివిధ కోర్సులకు సంబంధించిన ల్యాబ్స్ కూడా లేకపోవడం లాంటి కారణాలు వలన విద్యార్థులు రెగ్యులర్గా కాలేజ్ కి రావడం లేదని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధర్పల్లి డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ ని నియమించాలని అలాగే కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడం కోసం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ,విద్యార్థులలో అవగాహన కల్పించే రకంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దాల నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి హస్పె గణేష్, జిల్లా కమిటీ సభ్యులు నవీన్ , సందీప్, అభిషేక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

■ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి

**తొర్రూరు, విశాలభారతి:** బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని కర్కాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సెగ్గం రామ్మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా సందర్శించి రామ్మూర్తి చిత్రపటానికి పుష్పాంజాలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రఘాడసానుభూతిని తెలిపారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తామన్నారు.ఆమె వెంట బ్లాక్ అధ్యక్షులు జాటోత్ ఆమ్యా నాయక్,మండల పార్టీ అధ్యక్షులు సుంచు సంతోష్, నియోజకవర్గ సీనియర్ నాయకులు పెద్దగాని సోమయ్య,మాజీ మండల అధ్యక్షులు చెవిటి సధకర్,మెరుగు మల్లేష్,గ్రామ పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రావుల కిషన్ రెడ్డి తదితరులు, ఉన్నారు.

# ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా అడిషనల్ కలెక్టర్

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని గోదావరి ముప్పు ప్రాంతమైన బొమ్మన పెల్లి గ్రామాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ అధిక వర్షాలు కురవడంతో గోదావరి ఉధృతంగా పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి సమస్య ఏర్పడిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందజేయాలని సూచించారు.



# రైతులు ఆందోళన చెందొద్దు

■ వ్యవసాయ అధికారి ఎండి అఫ్జల్ పాషా

**భీమదేవరపల్లి, విశాల భారతి** రుణమాఫీ లిస్టులో పేరు లేని రైతులు ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయాధికారి అఫ్జల్ పాషా శుక్రవారం రైతులకు సూచించారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బ్యాంకులు, సొసైటీల ద్వారా రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీ లిస్టులో పేరు లేదని చాలామంది ఆందోళన చెందుతున్న విషయం తమ దృష్టికివచ్చిందని, పట్టాదారు, బ్యాంకు పాసుపుస్తకాలతో ముల్కనూర్ రైతు వేదికలో ఏర్పాటుచేసిన రైతు సహాయ కేంద్రం కౌంటర్ లో వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఏఈవో కమల్ హాసన్ రైతులు పాల్గొన్నారు.






# రైతన్నకు మాట ఇచ్చాం నిలబెట్టుకున్నాం

■ రైతు రుణమాఫీ చారిత్రాత్మక ఘట్టం

**సూర్యాపేట, విశాల భారతి** ప్రజాపాలనలో రైతన్నకు మాట ఇచ్చామని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని రైతు రుణమాఫీ చరిత్రాత్మక ఘట్టం అని, వ్యవసాయాన్ని పండగ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట నియోజకవర్గంలో ని ఆత్మకూర్ ఎస్ మండలంలో పాతర్లపహాడ్ గ్రామంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణా రెడ్డి స్థానిక రైతులతో కలిసి రుణమాఫీ సంభరాలలో పాల్గొన్న దామోదర్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారంగా ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ అమలు చేయడం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన విషయమని తెలిపారు. రైతులు ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతకాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ఒకేసారి రెండు లక్షలు రుణమాఫీ అమలు చేస్తున్నదని అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ధనిక రాష్టంలో రుణమాఫీని ఏడాదికి 25వేల చొప్పున నాలుగు విడతలుగా లక్ష రూపాయలు కూడ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. 2018లో మరోసారి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ఐదేండ్లు అధికారంలో ఉన్నప్పటికీ రుణమాఫీ అమలు చేయలేదన్నారు. ఆగస్టు 15లోగా మిగతా లక్ష రూపాయలు రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో తమ ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. 7 లక్షల కోట్లు అప్పులు ఉన్న ఈ రాష్ట్రంలో ఒకేసారి రెండు లక్షలు రుణమాఫీ చేయడం ఆర్థిక భారం అయినప్పటికీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శమని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకానికి ఇప్పటివరకు 635 కోట్ల 52 లక్షలు విద్యుత్ సంస్థలకు చెల్లించిందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం వల్ల ఏడు నెలల కాలంలో 40 లక్షల మందికి లబ్ధి చేకూరిందన్నారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కి రూ.280 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. రైతు రుణమాఫీని పండుగ వాతావరణంలో నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి ,కాకి కృపాకర్ రెడ్డి,గోదాల రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన క్రీడాకారునికి ఐటీడీఏ పీవో లక్ష ఆర్థిక సహాయం

**భద్రాచలం, విశాలభారతి:** సిటీ స్టైల్ జిమ్ కు చెందిన మోడెం వంశీ అనే గిరిజన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా రాష్ట్ర, జాతీయ పోటీలలో పాల్గొని, ఎన్నో బంగారు పతకాలను సాధించడమే కాకుండా యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు భారతదేశం తరుపున జూనియర్ విభాగంలో పవర్ లిఫ్టింగ్ పోటీలకు, ప్రాతినిధ్యం వహించడానికి ఎంపిక చేశారు. ప్రస్తుత ములుగు జిల్లా వాజేడు మండలం, ఇప్పగూడెంకు చెందిన మోడెం వంశి పదవ తరగతి వరకే చదివి, 8 సంవత్సరాల క్రితం అనగా 2016 లో జామాయిల్ నర్సరీలో పనికి కుదరగా, అతనిలో ప్రతిభను గుర్తించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అప్పటినుంచి పవర్ లిఫ్టింగ్ క్రీడలో ఓనమాలు నేర్పించి, అతన్ని అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే విధంగా తర్ఫీదు ఇప్పించారు. మాల్టా దేశంలో జరిగే పోటీలకు క్రీడాకారుడు వెళ్లాలంటే, ప్రతి అభ్యర్థి 2,10,000 రూపాయలు పవర్ లిఫ్టింగ్ ఇండియా అసోసియేషన్ వారికి చెల్లించవలసి ఉంటుంది. ఈ విషయం మన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ దృష్టికి రాగానే వెంటనే స్పందించి, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి సమాచారం చేరవేయగా స్వయంగా అభ్యర్థిని అసోసియేషన్ సభ్యులను వెంటబెట్టుకొని ఐటీడీఏ పీవో బి రాహుల్ కి ఆర్థిక సమస్యను వివరించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ జీవి రామిరెడ్డి( సిటీ స్టైల్ జిమ్ కోచ్), వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, ట్రెజరర్ మహంతి వెంకటకృష్ణ జి (నేషనల్ పవర్ లిఫ్టర్ ), జాయింట్ సెక్రెటరీ గుగులోతు శోభ నాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పసగడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ టీచర్స్‌గా నియమించాలి

■ సమగ్ర శిక్ష స్టేట్ సెక్రటరీ కి కేజీబీవీ గెస్ట్ టీచర్స్ వినతి



**భద్రాచలం, విశాలభారతి:** గత 6సంవత్సరాలుగా గెస్ట్ టీచర్స్ గా పనిచేసిన తమను విధుల్లోకి తీసుకొని కాంట్రాక్ట్ టీచర్స్ గా నియమించాలని కోరుతూ సమగ్ర శిక్ష స్టేట్ సెక్రటరీ మధు సూధన్ కు ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు ద్వారా కేజీబీవీ గెస్ట్ టీచర్స్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కసుర్బా గాంధీ బాలికా విద్యాలయాల నందు 2016నుండీ గెస్ట్ టీచర్స్ గాపనిచేస్తున్న తమ ను రెండు దఫాలుగా రంపచోడవరంలో, కాకినాడలో కౌన్సిలింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి డెమో క్లాస్ డిఇఓ సమక్షంలో తీసుకొని మా ప్రతిభను గుర్తించిన అదికారులు గెస్ట్ టీచర్స్ గా నియామకాలు జరిపారన్నారు. భవిషత్ లో కూడా మిములను కొనసాగిస్తామని హామీ ఇచ్చి, పై అధికారుల సమక్షంలో అప్పాయింట్ మెంట్ ఆర్డర్ ఇచ్చినారు అని అప్పటినుండి మేము రెగ్యులర్ సి ఆర్ టి టీచర్స్ తో సమానంగా నైట్ డ్యూటీ లు, సండే డ్యూటీలు, పండగ డ్యూటీలు, స్టడీ అవర్స్ డ్యూటీలు చేస్తూ మా సబ్జక్ట్ లలో 100శాతం పలితాలు తీసుకొచ్చాము అన్నారు. మాకు అవకాశం కల్పించకుండా అనుభవం లేనివారిని తీసుకొని ఎక్స్పీరియన్స్ వున్న మాకు అన్యాయంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గెస్ట్ ఫ్యాకల్టీ గా పనిచేస్తున్న తమను విధుల్లోకి తీసుకొని సిఆర్టిలు గా నియమించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. వారిలో ఎటపాక సిపిఎం మండల కార్యదర్శి ఐ వి, ఎటపాక, కూనవరం, వీఆర్ పురం, వై రామవరం, గంగవరం కేజీబీవీ గెస్ట్ టీచర్స్ కుమారి, వనజ, చంద్రమ్మ, పద్మశ్రీ, శాంతి లత, రామలక్ష్మి, పద్మ, సీతమ్మ ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily
శనివారం, 20.07.2024
హైదరాబాద్




# మమ్ముట్టి 'భ్రమయుగం' తెలుగులో విడుదల

లెజెండరీ యాక్టర్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో సైకలాజికల్ హారర్-థ్రిల్లర్ చిత్రంగా బ్లాక్ అండ్ వైట్ లో రూపొందించబడిన మలయాళ బ్లాక్‌బస్టర్ 'భ్రమయుగం' తెలుగులో ప్రతిష్ఠాత్మక సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా ఫిబ్రవరి 23న విడుదల కానుంది. కొందరు నటులు తమ నటనా నైపుణ్యంతో భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు తెచ్చుకుంటారు. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి అటువంటి లెజెండరీ నటుడే. ఆయన నటించిన సినిమా వస్తుందంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తారు. మమ్ముట్టి తాజా చిత్రం 'భ్రమయుగం' కూడా అలాగే అందరి దృష్టిని ఆకర్షించింది. నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ పతాకాలపై చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల మలయాళంలో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సినిమా యొక్క వైవిధ్యమైన కథాంశానికి, ఇందులోని మమ్ముట్టి అద్భుతమైన నటనను ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ప్రశంసలు కురిశాయి. మమ్ముట్టితో పాటు అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ వంటి నటీనటులు కూడా అద్భుతంగా నటించి మెప్పించిన ఈ చిత్రం.. ప్రేక్షకులకు వెండితెరపై ఓ కొత్త అనుభూతిని అందిస్తోంది. రచయిత-దర్శకుడు రాహుల్ సదాశివన్, సినిమాటోగ్రాఫర్ షెహనాద్ జలాల్, ఆర్ట్ డైరెక్టర్ జోతిష్ శంకర్, సంగీత దర్శకుడు క్రిస్టో జేవియర్, ఎడిటర్ షఫీక్ మహమ్మద్ అలీ, సౌండ్ డిజైనర్ జయదేవన్ చక్కాడత్, ఫైనల్ మిక్స్ ఇంజనీర్ ఎం.ఆర్. రాజాకృష్ణన్.. ఇలా చిత్ర బృందమంతా మనసుపెట్టి పనిచేసి, సమిష్టి కృషితో అద్భుతమైన అవుట్ పుట్ ని అందించారు. మలయాళం భాషలో ఇప్పటికే 'భ్రమయుగం' చిత్రాన్ని వీక్షించిన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు.. ఇది ప్రతి సినీ ప్రియుడు తప్పక చూసి అనుభూతి చెందాల్సిన సినిమా అని చెబుతున్నారు.



# అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిలిం అండ్ మీడియా యంగ్ ఫిల్మ్ మేకర్స్ కు 'కాశినాధుని విశ్వనాథ్ అవార్డు'

కళాతపస్వి కాశీనాధుని విశ్వనాథ్ గారి గౌరవప్రదమైన వారసత్వాన్ని పురస్కరించుకుని, అక్కినేని నాగేశ్వరరావుగతో ఆయనకు అనుబంధాన్ని స్మరించుకుంటూ, విశ్వనాథ్ కుమారుడు కె నాగేంద్రనాథ్ , వారి కుటుంబ సభ్యులతో కలసి ప్రతిష్ఠాత్మక వార్షిక 'కాశినాధుని విశ్వనాథ్ అవార్డు' ప్రకటించారు. ప్రభావవంతమైన, అర్థవంతమైన సినిమాని రూపొందించడానికి స్ఫూర్తిని ఇచ్చే లక్ష్యంతో అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఈ అవార్డును అందిస్తున్నారు. పరిశ్రమ ప్రముఖులచే నిర్దేశించబడిన ఉన్నత ప్రమాణాలను ప్రతిబింబిస్తూ సౌండ్ డిజైన్, డైరెక్షన్ రంగాలలో అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించే ఇద్దరు విద్యార్థులను సత్కరిస్తున్నారు. ప్రతి సంవత్సరం, ఈ అవార్డు ద్వారా ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25,000/ (మొత్తం యాభై వేల రూపాయలు) అందజేస్తారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లోని అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం వద్ద అక్కినేని నాగార్జున , అమలతో విశ్వనాథ్ కుమారుడు నాగేంద్ర, అతని భార్య లక్ష్మి, కొడుకు ప్రణవ్ కలిశారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు, అధ్యాపకులు, విద్యను అందించాలనే లక్ష్యంతో అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాను 2011లో శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, అక్కినేని కుటుంబం స్థాపించారు. ఇప్పుడు ఒక దశాబ్దానికి పైగా కాలేజ్ ఫిల్మ్ ఎడ్యుకేషన్ లో ముందంజలో ఉంది, నెక్స్ట్ జనరేషన్ ఫిల్మ్ మేకర్స్ ని అందిస్తోంది.




# 'షరతులు వర్తిసాయి' నుంచి లిరికల్ సాంగ్ విడుదల

చైతన్య రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం "షరతులు వర్తిస్తాయి". కుమారస్వామి (అక్షర) దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. "షరతులు వర్తిస్తాయి" సినిమా త్వరలో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఇవాళ ఈ సినిమా నుంచి 'కాలం సూపుల గాలంరా..' లిరికల్ సాంగ్ ను ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి మాట్లాడుతూ "షరతులు వర్తిసాయి" సినిమాలో 'కాలం సూపుల గాలంరా..' పాటకు గోరేటి వెంకన్న సాహిత్యాన్ని అందించగా రామ్ మిర్యాల పాడాడు. స్నేహితుడు అరుణ్ చిలువేరు సంగీతాన్ని అందించారు. ఆల్ ది బెస్ట్ అరుణ్ అండ్ టీమ్. చైతన్య హీరోగా కుమారస్వామి దర్శకత్వం వహించిన "షరతులు వర్తిసాయి" సినిమాను షరతులు పెట్టకుండా ఆడియెన్స్ చూసి విజయవంతం చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ ఈ ఒత్తిడి ప్రపంచంలో దర్శకుడిగా నాకు రిలీఫ్ ఇచ్చేది సంగీతమే. నేను రోజూ వినే పది పాటల్లో నాలుగు కీరవాణి గారివే ఉంటాయి. ఆయన విలువైన సమయాన్ని కేటాయించి మా "షరతులు వర్తిసాయి" సినిమాలోని 'కాలం సూపుల గాలంరా..' పాట రిలీజ్ చేసినందుకు కీరవాణి గారికి పాదాభివందనాలు తెలియజేస్తున్నా. ఈ పాటకు గోరేటి వెంకన్న సాహిత్యం, అరుణ్ చిలువేరు కంపోజిషన్, రామ్ మిర్యాల పాడిన విధానం మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. ఈ పాట వినండి, మీ స్నేహితులకు షేర్ చేయండి. అన్నారు.

# సీతమ్మ కి వారిద్దరే స్ఫూర్తి!

మరాఠీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ తెలుగింట ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఇక్కడి అభిమానుల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయే స్థానాన్ని రెండు సినిమాలతోనే దక్కించుకుంది. 'సీతారామం'లో సీత పాత్ర..'హాయ్ నాన్న'లో యష్న పాత్రలు ఎంత గొప్పగా పండాయో చెప్పాల్సిన పనిలేదు. ఆ రెండు పాత్రలు ఆమెని ప్రత్యేకమైన నటిగా తీర్చిదిద్దాయి. ఇలాంటి పాత్రల్లో తాను మాత్ర నటించగలని ప్రూవ్ చేసింది. తనలో ఆ క్వాలిటీనే మృణాల్ ని మిగతా భామల నుంచి వేరు చేస్తుంది. ఎలాంటి అశ్లీలతకు తావు ఇవ్వ కుండా చేసిన ఆ పాత్రలు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయాయి. అందుకే అంత మంచి పేరు దక్కించుకుంది. మరి ఇలాంటి పాత్రల ఎంపికకు స్ఫూర్తి ఎవరు? అంటే మృణాల్ ఇద్దరు పేర్లు ప్రముఖం గా చెబుతుంది. వారే రష్మిక మందన్న...దుల్కర్ సల్మాన్. ఈ ముగ్గురి కాంబినేషన్ లోనే 'సీతారామం' తెరకెక్కిన సంగతి తెలిసిందే. అందులో ఆఫ్రీన్ పాత్రలో రష్మిక మందన్న..ఆర్మీ ఆఫీసర్ పాత్రలో దుల్కర్ నటించాడు. అయితే ఆఫ్రిన్ పాత్రకు రష్మిక తప్ప ఇంకేనటి న్యాయం చేయలేని మృణాల్ చెబుతుంది. రష్మిక అన్ని వేళలా అలసట లేకుండా పనిచేస్తుందని..తనంత యాక్టివ్ గా తాను ఉండలనేని ఈ విషయాలో రష్మిక తనకెంతో స్ఫూర్తి అంది. ఇక దుల్కర్ భాషతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తారు. అది ఆయన అంకిత భావానికి నిదర్శనం అంది. 'నా జీవితంలో వీరిద్దర్నీ స్ఫూర్తిగా తీసుకుని సినిమాలు చేస్తున్నాను అని బలంగా చెప్పగలను. అలాంటి వారి నుంచి స్ఫూర్తి పొందితే మంచి కథలు..పాత్రలు చేయడానికి అవకాశం ఉంటుంది. నాకు తెలియ కుండానే వాళ్ల ప్రభావం నాపై బలంగా ఉందనపిస్తుంది' అంది. ఆ రకంగా అమ్మడు తన సక్సెస్ సీక్రెట్ కూడా వారిద్దరే అన్నట్లు పరోక్షంగా ఒప్పుకున్నట్లు అయింది. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్..విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీ స్టార్' లో నటిస్తోంది.



# ఒక పథకం ప్రకారం విడుదలకు సిద్ధం



వినోద్ విజయన్ ఫిలిమ్స్, విహారి సినిమా హౌజ్ బ్యానర్స్ పై సాయిరామ్ శంకర్, అశీమా నర్వాల్, శృతీ సోధిలు హీరోహీరో యిన్లుగా ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకున్న వినోద్ విజయన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ విజయన్, గార్లపాటి రమేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రాన్ని మార్చి లో థియేటర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. ఈ సందర్భంగా నిర్మాత, దర్శకుడు వినోద్ విజయన్ మాట్లాడుతూ- "విభిన్నమైన కథాంశంతో ఈ సినిమా రూపొందింది. ఈ థ్రిల్లర్ సినిమాలో హీరో సాయిరామ్ శంకర్ విభిన్నమైన, పవర్ ఫుల్ అడ్వకేట్ పాత్రలో కనిపిస్తారు. సముద్రఖని పోలీస్ ఆఫీసర్ పాత్రలో అత్యద్భుతంగా నటించారు. గోపిసుందర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాకే హైలైట్ గా నిలుస్తుంది. రాహుల్ రాజ్ అద్భుతమైన రెండు పాటలు అందించగా, సిద్ శ్రీరాం ఆ పాటలకు ప్రాణం పోశారు. ఇప్పటికే టిప్స్ మ్యూజిక్ ద్వారా విడుదలై మొదటి పాట "ఒసారిలా రా" మంచి రెస్పాన్స్ అందుకుంది.

# రౌనత్ యార్ ఖాన్ , తేజ సజ్జ లాంచ్ చేసిన మై స్కూల్ ఇటలీ నేచర్స్ లాప్



యూరోపియన్ న్యూరో బేస్డ్ మై స్కూల్ ఇటలీ సంస్థ జూబ్లీహిల్స్ లో ఇండియాలోనే తొలిసారిగా నేచర్స్ లాప్ పేరుతో ప్రీ స్కూల్, కిండర్ గార్డెన్ స్కూల్ ను ఏర్పాటు చేసింది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 25 లో ఏర్పాటుచేసిన ఈ స్కూల్ ని హనుమాన్ సినిమా హీరో తేజ సజ్జ ముఖ్య అతిథిగా విచ్చేసి 9వ నిజాం నవాబ్ రౌనత్ యార్ ఖాన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య చదువుకు అలవాటు పడిన పిల్లలకు ఈ ప్రకృతి ఒడిలో పాఠాలు కొత్త అనుభూతినిస్తాయని అన్నారు. పిల్లలకు చిన్న వయసు నుంచే ప్రకృతికి మనకున్న అనుబంధాన్ని తెలియజేసేలా దీన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. తాను తాను నటించిన హనుమాన్ మూవీకి ఇప్పుడే సీక్వెల్ చేయమని కొంత సమయం తీసుకుంటామని ఈ మధ్యలో వేరే సినిమాలు చేస్తామని అన్నారు. సంస్థ ఫౌండర్ చైర్మన్ ప్రసాద్ గారపాటి మాట్లాడుతూ ఇటలీ స్కూల్స్ లో ముఖ్యంగా సహజత్వానికి దగ్గరగా, ప్రాక్టికల్ గా పాఠాలు బోధిస్తారని, తనకు విద్యపై ఉన్న మక్కువతో ఈ ప్రకృతి ఒడిలో పాఠాలు అనే కాన్సెప్ట్ ను తీసుకొచ్చానని అన్నారు. రౌనత్ యార్ ఖాన్ కు చెందిన ఈ స్థలంలో రెండెకరాల విస్తీర్ణం లో చిన్నారులకు రంగులు, పూలు, పక్షులు ఇలా ప్రతి విషయాన్ని ప్రకృతిలో అండర్ ద స్కై అనే కాన్సెప్ట్ లో బోధిస్తామని అన్నారు. మరో ఏడాది కాలంలో 150 నూతన బ్రాంచెస్ ను తెరిచేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండి అపర్ణ వెల్లూరు, సంగీత దర్శకుడు ఆర్ పి పట్నాయక్, ఇటాలియన్ ఎంబసీ ప్రతినిధి డాక్టర్ మరియా డానియల్ , ఇన్కమ్ టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ డి సుధాకర్ రావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# 'హద్దు లేదురా' తప్పకుండా అందరినీ అలరిస్తుంది

: హీరో ఆశిష్ గాంధీ

ఆశిష్ గాంధీ, అశోక్ హీరోలుగా వర్ష, హ్రితిక హీరోయిన్లుగా రాజశేఖర్ రావి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం "హద్దు లేదురా'. టైగర్ హిల్స్ ప్రొడక్షన్, స్వర్ణ పిక్చర్స్ బ్యానర్స్‌పై వీరేష్ గాజుల బళ్లారి నిర్మిస్తున్నారు. రావి మోహన్ రావు సహా నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ టీజర్ ని లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో ఆశిష్ గాంధీ మాట్లాడుతూ.. నేను నటించిన 'నాటకం' టీజర్ ఇక్కడే లాంచ్ అయ్యింది. అది చాలా మంచి హిట్ అయ్యింది. అలాగే హద్దులేదురా సినిమా కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. మా సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులని అలరిస్తుంది. నాటకం తర్వాత నేను విన్న కథ హద్దు లేదురా. అప్పటి నుంచి దర్శకుడు, నేను స్నేహితుల్లా ట్రావెల్ అవుతున్నాం. నిర్మాత వీరేష్ చాలా సపోర్ట్ చేశారు. అశోక్ వర్ష, హ్రితిక అందరూ అద్భుతంగా నటించారు. రాంబాబు గారు మంచి సాహిత్యం అందించారు. సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. ప్రతి ఒక్కరూ సినిమా చూసి ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు రాజశేఖర్ రావి మాట్లాడుతూ.. కృష్ణార్జునులు స్నేహంగా ఉంటూ వారి సమస్యలని ఎలా పరిష్కరించారో ఈ జనరేషన్ లో ఇద్దరు ఫ్రెండ్స్ కృష్ణార్జునులైతే వారికి వచ్చిన సమస్యలని ఎలా పరిష్కరిస్తారో ఇప్పటి యూత్ కి కనెక్ట్ అయ్యేలా చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఆల్రెడీ షో వేశాం. చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సురేష్ ప్రొడక్షన్ లాంటి గొప్ప సంస్థకి సినిమా నచ్చడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. అన్ని ఏజ్ గ్రూప్ ల వారికి ఈ సినిమా నచ్చుతుంది. కమల్ కుమార్ గారు అద్భుతమైన ఐదు పాటలు ఇచ్చారు. ఆయన ఈనాడు మన మధ్య లేకపోవడం చాలా బాధకరం. ఆయన ఇచ్చిన పాటలు ప్రేక్షకుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతాయి. త్వరలోనే పాటలని విడుదల చేస్తాం. ఈ సినిమాలో క్లైమాక్స్ చాలా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకులని కంటెంట్ ని నమ్ముకొని ఈ సినిమా చేశాం. నిర్మాత వీరేష్ అద్భుతంగా సపోర్ట్ చేశారు. ఈ ప్రయాణంలో హీరో ఆశిష్ గాంధీ ఎంతో సహకరించారు. చాలా ఇష్టంగా చేసిన సినిమా ఇది. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం వుంది" అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.